

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 08-06-2025 | సంపుటి - 24 | సంచిక - 37 | రూ : 4 | పేజీలు: 8




## తెలంగాణ బియ్యానికి బ్రాండింగ్

- మిగులు సన్నధాన్యంపై దృష్టి
- 'బీపీటీ, ఆర్ఎన్ఆర్' ప్రత్యేకంగా నిల్వ
- ఓపెన్ మార్కెట్లో విక్రయానికి ప్రణాళికలు

**జూన్ 07, హైదరాబాద్:** రాష్ట్ర అవసరాలకు మించి సన్న వడ్లు వస్తుండటంతో మిగులు ధాన్యాన్ని మిల్లింగ్ చేయించి బియ్యాన్ని విక్రయించేందుకు పౌరసరఫరాల సంస్థ సిద్ధం

తరువాయి 2లో

# నేడు మంత్రివర్గ విస్తరణ



- శ్రీహరి, వివేక్, లక్ష్మణ్‌కుమార్‌లకు చోటు
- ఉప సభాపతిగా రామచంద్రునాయక్!

**జూన్ 07, హైదరాబాద్:** రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధమైంది. కొత్తగా ముగ్గురికి చోటు దక్కనుంది. ఆదివారం మధ్యాహ్నం 12.00 12.20 గంటల మధ్య ప్రమాణస్వీకారం జరగనుంది. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం.. బీసీల నుంచి వి.శ్రీహరి ముదిరాజ్, ఎస్సీల నుంచి వివేక్ (మాల), అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ (మాదిగ)లకు చోటు లభించనుంది. శాసనసభ ఉప సభాపతిగా రామచంద్రునాయక్‌ను ఎంపిక చేసినట్లు తెలిసింది. విస్తరణలో సామాజిక న్యాయాన్ని పరిగణనలోకి తీసుకుని ఎస్సీ, ఎస్టీ, బీసీలకు మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని అధిష్ఠానం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కాగా మంత్రివర్గ విస్తరణలో సుదర్శన్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిల పేరు

తరువాయి 2లో

## ఎమ్మెల్యేలు గాడి తప్పితే వదులుకోవడానికీ సిద్ధం

- ప్రభుత్వానికి, పార్టీకి నష్టం కలిగిస్తే ఉపేక్షించను
- వన్‌టైమ్ ఎమ్మెల్యేలుగా మిగిలిపోతామంటే అది మీ ఇష్టం
- అందరి పనితీరు, వ్యవహారశైలిపై సమాచారం ఉంది
- త్వరలో ప్రతి ఒక్కరితో ముఖాముఖి
- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు



2లో



## రాజీవ్ స్వగృహ, హౌసింగ్ బోర్డు స్థలాల వేలం

- ప్రభుత్వం నిర్ణయం.. 20న నోటిఫికేషన్‌కు సన్నాహాలు
- రూ.3,500 కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా
- వచ్చే సొమ్ము సంక్షేమ పథకాలకు ఖర్చు చేసే యోచన

**జూన్ 07, హైదరాబాద్:** హౌసింగ్ బోర్డు పరిధిలోని రాజీవ్ స్వగృహ, హౌసింగ్ బోర్డు స్థలాలను వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్, హౌసింగ్ బోర్డు కమిషనర్ గౌతమ్.. ఈ మేరకు ప్రతిపాదలను సిద్ధం చేయగా వనరుల సమీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. ఈ మేరకు ఈ నెల 20న నోటిఫికేషన్ విడుదల చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వేలం ద్వారా రూ.3,500 కోట్లకుపైగా ఆదాయం వచ్చే అవకాశాలున్నాయని గృహ నిర్మాణ శాఖ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో వెల్లడించినట్లు తెలిసింది. ఈ నిధులను అభివృద్ధి కార్యక్రమాలకు, ఇందిరమ్మ ఇళ్ల పథకంతోపాటు మధ్య తరగతి గృహ నిర్మాణాలకు ఉపయోగించనున్నట్లు ప్రభుత్వ వర్గాల సమాచారం.

### 11 ప్రాంతాల పరిధిలో..

గృహ నిర్మాణ శాఖ ప్రతిపాదనల మేరకు..రాజీవ్

తరువాయి 2లో

## రాజధానిలో 65 వేల కొత్త ఆటోలు

- ఎలక్ట్రిక్, సీఎన్జీ, ఎల్పీజీతో నడిచే వాటికే అనుమతి
- ఔటర్ రింగ్ రోడ్డు లోపల తిరిగేలా పర్మిట్లు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- వేల కుటుంబాలకు ఉపాధి లభిస్తుంది: మంత్రి పొన్నం



**జూన్ 07, హైదరాబాద్:** జనాభా పెరుగుదలకు అనుగుణంగా ఆటోల సంఖ్యను పెంచేందుకు అనుమతిస్తున్నట్లు రవాణాశాఖ పేర్కొంది. కాలుష్య సమస్య నేపథ్యంలో హైదరాబాద్ నగరంలో కొత్త ఆటోలకు అనుమతులు ఇవ్వట్లేదు. అయితే నగరంలో రోజురోజుకు పెరుగుతున్న జనాభా, రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చివెళ్లే ప్రజలతో ఆటోలకు డిమాండ్ పెరిగింది. ఈ పరిస్థితుల్లో కొత్త ఆటోలకు పర్మిట్ల జారీకి అనుమతివ్వాల్సిందిగా రవాణాశాఖ కమిషనర్ ఫిబ్రవరిలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. పరిశీలించిన

తరువాయి 2లో



## శత్రుత్వం ముగుస్తుందా..!

- మోదీ కెనడా పర్యటనపై సర్వత్రా ఆసక్తి

జీ7 శిఖరాగ్రసదస్సుకు భారత్‌ను కెనడా ఆహ్వానిస్తుందా లేదా అనే దానిపై పలు ఊహాగానాలు చెలరేగాయి. కెనడా ఆహ్వానించదని, ఒకవేళ పిలిచినా భారత్ తిరస్కరిస్తుందని పలు కథనాలు వెలువడ్డాయి. వాటిని పటాపంచలు చేస్తూ కెనడా ప్రధాని మార్క్ కార్నీయే స్వయంగా మోదీని ఆహ్వానించడం, అందుకు ఆయన అంగీకరించడం చకచకా జరిగిపోయాయి.

తరువాయి 2లో

## నివురుగప్పిన నిప్పు!

- మస్క్ గురించి ఆలోచించడం లేదని ట్రంప్ వ్యాఖ్య
- ఆయన బాగుండాలంటూనే విమర్శలు
- 'ద అమెరికా పార్టీ' అంటూ మస్క్ ట్వీట్
- ఇద్దరూ తగ్గాలని రిపబ్లికన్ల హితవు

వాషింగ్టన్: అమెరికాలో ఇద్దరు శక్తిమంతమైన వ్యక్తుల మధ్య చెలరేగిన ఘర్షణ నివురుగప్పిన నిప్పులా ఉంది. ఒకరిపై ఒకరు తీవ్రంగా వ్యాఖ్యలు చేసుకున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, టెస్లా అధినేత ఎలాన్ మస్క్‌లు ఎవరి పనిలో వారు పడిపోయారు. తాను వేరే పనులతో బిజీగా ఉన్నానని ట్రంప్ వ్యాఖ్యానించగా.. 'ద అమెరికా పార్టీ' అంటూ మస్క్ ట్వీట్ చేశారు. మరోవైపు ఇద్దరూ కాస్త తగ్గాలని రిపబ్లికన్లు పిలుపునిచ్చారు. 'నేను బిజీగా ఉన్నా. చైనా, రష్యా, ఇరాన్ అంశాలపై పని చేస్తున్నా. నాకు చాలా పనులున్నాయి. మస్క్ గురించి ఇప్పుడు ఆలోచించడం లేదు. ఆయన బాగుండాలని కోరుకుంటున్నా' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'మేం అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకుంటున్నాం. ఆయన (మస్క్) చాలా సబ్సిడీలు పొందారు. పెద్ద మొత్తంలో డబ్బులు అందుకున్నారు. దాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉంది. అంతా పారదర్శకంగానే జరిగిందా.. అనేది చూడాలి. మస్క్ లేకపోయినా మా ప్రభుత్వం కొనసాగుతుంది. ఎవరు లేకపోయినా అమెరికాకు ఏం కాదు.. ఒక్క నేను తప్ప' అని ట్రంప్ స్పష్టం చేశారు. మస్క్‌తో ప్రైవేటుగా మాట్లాడాలని తాను ప్రయత్నిస్తున్నానంటూ వస్తున్న కథనాలను ఆయన ఖండించారు. 'నాకు అలాంటి ప్రణాళికలు ఏమీలేవు. ఎవరో తప్పుగా ఆ కథనాలు రాసి ఉంటారు. నేను దాని గురించి ఆలోచించట్లేదు. ప్రస్తుతానికి ఆయనతో మాట్లాడే ఉద్దేశం నాకు లేదు. ఎలాన్ మస్క్‌కు మైండ్ సరిగ్గా పనిచేయడం లేదు' అంటూ విభేదాలను మరింత పెంచేలా ట్రంప్ మాట్లాడారు.

### వెనక్కి తగ్గిన మస్క్

తరువాయి 2లో



# నేడు మంత్రివర్గ విస్తరణ

(మొదటిపేజీ తరువాయి)

మొదటి నుంచీ వినిపించినా ప్రస్తుతానికి ఎస్సీ, బీసీలకు మాత్రమే అవకాశం ఇవ్వాలని అధిష్ఠానం చెప్పినట్లు తెలిసింది. అయితే మాదిగ సామాజికవర్గంతోపాటు ఎస్టీల నుంచి కూడా ఒకరికి అవకాశం ఇవ్వాలని.. నిజామాబాద్ జిల్లా నుంచి సుదర్శన్‌రెడ్డికి కూడా చోటు కల్పించాలని ముఖ్యమంత్రి పట్టుబడుతున్నట్లు సమాచారం. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి అవకాశం ఇస్తే ఆయన సోదరుడు, మంత్రి వెంకట్‌రెడ్డిని కూడా కొనసాగించడం కష్టమని, ఇద్దరిలో ఒకరికి మాత్రమే చోటు కల్పించాల్సి ఉంటుందని అధిష్ఠానం స్పష్టంచేయడంతో ఈ అంశాన్ని ప్రస్తుతానికి పక్కనపెట్టినట్లు తెలిసింది.

**విస్తృత చర్చల అనంతరం..**

గతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌లతో కాంగ్రెస్ అధిష్ఠానం చర్చించింది. అందరి అభిప్రాయాలు విన్న తర్వాత ఎవరెవరికి చోటు కల్పించాలో నిర్ణయం చెబుతామన్న అధిష్ఠానం శనివారం తన అభిప్రాయాన్ని తెలిపినట్లు సమాచారం. అనంతరం పార్టీకి సంబంధించిన పలువురు నాయకులతో ముఖ్యమంత్రి చర్చించినట్లు తెలిసింది. నాలుగో పేరును ప్రస్తుతానికి పక్కనపెట్టి రాష్ట్ర మంత్రివర్గ విస్తరణకు రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ముగ్గురికి అవకాశం కల్పిస్తే మరో మూడు స్థానాలు ఖాళీగా ఉంటాయి. వీటితోపాటు చీఫ్ విప్ పదవి భర్తీకి కూడా కసరత్తు సాగుతోంది. బీసీల నుంచి ఆది శ్రీనివాస్ ప్రస్తుతం శాసనసభలో విప్‌గా ఉన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి మంత్రివర్గంలో ఎవరూ లేనందున వికారాబాద్ ఎమ్మెల్యే, సభాపతి ప్రసాద్‌కుమార్‌ను మంత్రివర్గంలోకి తీసుకుని అదే సామాజికవర్గానికి చెందిన మరొకరికి సభాపతి పదవి ఇస్తే ఎలా ఉంటుందనే అంశం కూడా పార్టీ పరిశీలనలో ఉన్నట్లు నేతలు చెబుతున్నారు. మంత్రి పదవుల కోసం గట్టిగా పోటీపడుతున్నవారిలో ఒకరికి చీఫ్ విప్ పదవి ఇచ్చి సర్దుబాటు చేసే అవకాశాలున్నాయి. గత 4 రోజులుగా హైదరాబాద్‌లోనే ఉన్న మీనాక్షి నటరాజన్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా చర్చించిన నేపథ్యంలో సామాజిక న్యాయాన్ని దృష్టిలో పెట్టుకుని విస్తరణ ఉండాలని అధిష్ఠానానికి సూచించినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. పార్టీ లైనుకు భిన్నంగా ఎవరు మాట్లాడినా తదుపరి పదవుల్లో వారికి ప్రాధాన్యం ఉండదని స్పష్టం చేస్తున్నట్లు సమాచారం.

**సీఎంకు వినతిపత్రం..**

ఎస్సీ వర్గీకరణ అమలుకు దేశంలోనే తొలిసారి తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టినందున దానిప్రకారం మంత్రివర్గంలో తమ వర్గానికి తగు ప్రాతినిధ్యం కల్పించాలని మాదిగ సామాజికవర్గ ఎమ్మెల్యేలు శనివారం సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు. అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వేముల వీరేశం, సామేల్, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలె యాదయ్య సీఎంను కలిసినవారిలో ఉన్నారు. గత ఏడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కూడా తమ వర్గానికి తగినన్ని టికెట్లు ఇవ్వలేదని, అనంతరం ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా అవకాశం రాలేదని, మంత్రివర్గంలో తప్పనిసరిగా ఒకరికి చోటు కల్పించాలని వారు సీఎంను కోరినట్లు తెలుస్తోంది.

# తెలంగాణ బియ్యానికి బ్రాండింగ్

(మొదటిపేజీ తరువాయి)

అవుతోంది. సన్నబియ్యంలో బీపీటీ, ఆర్‌ఎన్‌ఆర్, జై శ్రీరాం రకాలకు మంచి డిమాండ్ ఉంటుంది. ఈ మూడు కేటగిరీలను పౌరసరఫరాల సంస్థ ప్రత్యేకంగా నిల్వ చేయించింది. తెలంగాణ బ్రాండ్ పేరుతో ప్యాక్ చేయించి ఓపెన్ మార్కెట్లో విక్రయించనున్నట్లు పౌరసరఫరాల సంస్థ వర్గాలు తెలిపాయి.

**వానాకాలంలో పండించిన వడ్లే**

వానాకాలం, యాసంగి సీజన్లలో భారీఎత్తున సన్నధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చింది. వానాకాలంతో పోలిస్తే యాసంగి పంటలో నూకలు అధికంగా వస్తాయి. ఈ నేపథ్యంలో వానాకాలం వడ్లతో వచ్చిన బియ్యాన్ని తెలంగాణ బ్రాండ్ పేరుతో విక్రయించనున్నట్లు పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ 'ఈనాడు'కు తెలిపారు.

**రేషన్ దుకాణాల్లోనూ బియ్యం విక్రయం**

రాష్ట్రంలో సూపర్‌మార్కెట్లు, కిరాణా దుకాణాలతో పాటు రేషన్ షాపుల్లోనూ ఈ బియ్యాన్ని విక్రయించనున్నట్లు సమాచారం. రేషన్‌షాపుల్లో ప్రస్తుతం ఆహార భద్రత కార్డు(తెల్లకార్డు) ఉన్నవారికి ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నారు. దారిద్ర్యరేఖకు ఎగువన ఉన్నవారికి ఏపీఎల్ కార్డులు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. తెలంగాణ బ్రాండ్ బియ్యాన్ని ఏపీఎల్ కార్డుదారులు కొనుగోలు చేసేందుకు వీలుగా రేషన్ దుకాణాల్లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలుస్తోంది.

**ధరపై అధికారుల కసరత్తు**

తెలంగాణ బ్రాండ్‌తో విక్రయించే బియ్యానికి ధర ఎంత నిర్ణయించాలన్న విషయంపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఈ మేరకు ప్రస్తుతం మార్కెట్లో ఉన్న సన్నబియ్యం ధరలను పరిశీలిస్తున్నారు. ధాన్యాన్ని ఎఫ్‌సీఐకి ఇస్తే డబ్బులు రావడానికి కనీసం ఆరు నెలల నుంచి ఏడాది వరకు సమయం పడుతుందని.. అదే తెలంగాణ బ్రాండ్‌తో బియ్యాన్ని విక్రయిస్తే వెంటనే డబ్బులు వస్తాయని ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఇతర రాష్ట్రాల్లోనూ ఈ బియ్యాన్ని విక్రయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ వర్గాల సమాచారం.

# రాజధానిలో 65 వేల కొత్త ఆటోలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం 65 వేల కొత్త ఆటోలకు అనుమతిస్తూ నిర్ణయం తీసుకుంది. వాటికి రవాణాశాఖ పర్మిట్లు జారీ చేయనుంది. అయితే కొత్తగా వచ్చే ఆటోలను హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతం వరకే పరిమితం చేస్తున్నట్లు రవాణాశాఖ స్పష్టం చేసింది. కాలుష్య సమస్యకు దారితీసే డీజిల్, పెట్రోల్‌తో నడిచేవాటికి కాకుండా ఇంధనంగా సీఎన్జీ, ఎల్పీజీ వంటి వాటిని ఉపయోగించే ఆటోలకే అనుమతులు ఇవ్వనున్నట్లు తెలిపింది. ఈ మేరకు రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒక వ్యక్తికి ఒకటికి మించి పర్మిట్లు ఇవ్వొద్దని రవాణాశాఖ స్పష్టం చేసింది.

**సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా..**

ఆటోల సంఖ్య పెరిగినా కాలుష్యం పెరగదని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. తాజా నిర్ణయంతో 65 వేల కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. 'సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా హైదరాబాద్‌లో కాలుష్యాన్ని తగ్గించడానికి ఈ నిర్ణయం ఎంతగానో ఉపయోగపడుతుంది' అని పేర్కొన్నారు.

# ఘనంగా బక్రీద్ వేడుకలు

దిల్లీ: దేశవ్యాప్తంగా ముస్లింలు శనివారం ఈద్ ఉల్ అదా (బక్రీద్)ను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. మసీదుల్లో ప్రార్థనలు చేశారు. బక్రీద్ సందర్భంగా ముస్లింలకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీనగర్‌లోని హజ్రత్‌బల్ దర్గాలో 40 వేల మంది ప్రార్థనలు చేశారు. ''అందరికీ ఈద్ ఉల్ అధా శుభాకాంక్షలు. ఈ పండగ సమాజంలో సామరస్యాన్ని పెంపొందించాలని, శాంతిని నెలకొల్పాలని కోరుకుంటున్నా. అలాగే అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నా'' అని మోదీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

# రాజీవ్ స్వగృహ, హౌసింగ్ బోర్డు స్థలాల వేలం

(మొదటిపేజీ తరువాయి)

స్వగృహ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 11 ప్రాంతాల్లో పూర్తయిన, నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తుల భవనాల్లోని ఫ్లాట్లు, ఖాళీ స్థలాలకు బహిరంగ వేలం నిర్వహిస్తారు. రాజీవ్ స్వగృహ పరిధిలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గాజులరామారం, పోచారం, ఖమ్మం జిల్లాలోని పోలేపల్లి ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న టవర్లలో(ఒక్కో టవర్‌లో 100 నుంచి 150 వరకు ఫ్లాట్లు ఉంటాయి)ని ఫ్లాట్లను ఏకమొత్తంగా విక్రయిస్తారు. 'ఎలాంటి వివాదాలు లేని భూములను కూడా అందుబాటు ధరకే అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ విక్రయాలతో వచ్చిన నిధులను ఓఆర్ఆర్ సమీపంతోపాటు ఇతర ప్రాంతాల్లో సాధారణ ప్రజల హౌసింగ్ పథకాలకు ఉపయోగిస్తాం' అని హౌసింగ్ బోర్డు పేర్కొంది. బిల్డర్లతో పాటు ఎవరైనా ఒక గ్రూపుగా ఏర్పడి కూడా వేలంలో పాల్గొనవచ్చని తెలిపింది. బహుళ అంతస్తుల భవనాలు అవసరం ఉన్న సంస్థలు కూడా ఈ వేలంలో పాల్గొనడానికి అవకాశం కల్పించినట్లు వెల్లడించింది.

*** రాజీవ్ స్వగృహ ఆస్తుల వివరాలిలా..**

* రంగారెడ్డి జిల్లా తొర్రూర్‌లో 514, కుర్మల్‌గూడలో 20, చందానగర్‌లో 3, మహబూబ్‌నగర్ జిల్లా పరిధి పోతులమడుగులో 111, అమిస్తాపూర్‌లో 45 ఖాళీ ప్లాట్లు.
* మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిధి బండ్లగూడలో 159, పోచారంలో 601 పూర్తయిన ఫ్లాట్లు.
* ఖమ్మం జిల్లా పోలేపల్లిలో అసంపూర్తిగా ఉన్న 8 టవర్లతోపాటు 3.38 ఎకరాల ఖాళీ స్థలం.
* గ్రేటర్ హైదరాబాద్ పరిధి కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ 4వ ఫేజ్‌లో ఖాళీగా ఉన్న ఏడు ఎకరాల 33 గుంటల ఖాళీ స్థలం, రెండు ఫ్లాట్లు. సంజీవ్‌రెడ్డినగర్‌లో అసంపూర్తిగా ఉన్న సామాజిక భవనానికి చెందిన 2,605 చదరపు గజాల స్థలం.

# నివురుగప్పిన నిప్పు!

(మొదటిపేజీ తరువాయి)

ట్రంప్‌పై ఎక్స్ వేదికగా తీవ్ర స్థాయి విమర్శలు చేసిన మస్క్ కాస్త వెనక్కి తగ్గారు. ట్రంప్‌పై చేసిన బిగ్‌బాంబ్ పోస్టును ఆయన తొలగించారు. సెక్స్ కుంభకోణంలో నిందితుడైన ఎప్‌స్టెన్‌కు సంబంధించిన దర్యాప్తు ఫైళ్లలో ట్రంప్ పేరుందని మస్క్ ఆరోపించారు. అందువల్లే దర్యాప్తులో వెల్లడైన విషయాలను ఇప్పటివరకూ బహిరంగంగా బయటపెట్టలేదని తీవ్ర విమర్శలు చేశారు. అంతే కాదు భవిష్యత్తులో దీనికి సంబంధించిన చాలా విషయాలు బయటపడతాయని వ్యాఖ్యానించారు. తాజాగా ఆ పోస్టును మస్క్ తొలగించారు.

*** డెమోక్రాట్లకు మస్క్ మద్దతిస్తే తీవ్ర పరిణామాలు: ట్రంప్**

బ్రిడ్జ్‌వాటర్: తనతో ఘర్షణ పడుతున్న ఎలాన్ మస్క్‌కు శనివారం మరోసారి ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో డెమోక్రాట్లకు మద్దతిస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. మస్క్‌తో వివాదాన్ని పరిష్కరించుకోవడానికి సిద్ధంగా లేనని స్పష్టం చేశారు.

*** పార్టీ పేరుపై మస్క్ వ్యాఖ్య**

ట్రంప్‌నకు వ్యతిరేకంగా పోస్టులు చేస్తున్న మస్క్.. 80 శాతం అమెరికన్లకు ప్రాతినిధ్యం వహించేలా కొత్త పార్టీ స్థాపించడానికి ఇది తగిన సమయమేనా అంటూ ఫాలోవర్లను 'ఎక్స్'లో ప్రశ్నించిన సంగతి తెలిసిందే.. ఆ ఓటింగ్ ఫలితాన్ని ప్రకటిస్తూ.. '80 శాతం మందికి ప్రాతినిధ్యం వహించేలా కొత్త పార్టీ ఇప్పుడు అవసరమే. దీన్ని 80శాతం మంది సమర్థించారు' అని పేర్కొన్నారు. 'ద అమెరికా పార్టీ' అంటూ మస్క్ ఈ పోస్టు చేయడం కలకలం రేపింది. అయితే అమెరికాలో పుట్టని మస్క్‌కు అధ్యక్షుడయ్యే అవకాశం లేదు. ట్రంప్, మస్క్‌ల మధ్య విభేదాలతో షాక్‌కు గురైన రిపబ్లికన్లు శాంతి మంత్రం పఠిస్తున్నారు. ఇద్దరూ మళ్లీ కలిసి పని చేయాలని కోరుకుంటున్నామని సెనేటర్ టెడ్ క్రజ్ అభిప్రాయపడ్డారు. అప్పుడే దేశానికి మంచి చేయగలమని స్పష్టం చేశారు. ఇంకా పలువురు సెనేటర్లు, ప్రతినిధుల సభ సభ్యులు వారిద్దరి మధ్య సయోధ్య కుదరాలని ఆకాంక్షించారు. ట్రంప్, మస్క్‌ల వివాదం ప్రభావం పన్ను, సరిహద్దు బిల్లుపై ఉండబోదని స్పీకర్ మైక్ జాన్సన్ అభిప్రాయపడ్డారు.

# శత్రుత్వం ముగుస్తుందా..!

(మొదటిపేజీ తరువాయి)

గత కొంతకాలంగా క్షీణిస్తున్న భారత్‌కెనడా సంబంధాల్లో ఇదో కీలక పరిణామం.

**విద్వేషం రగిల్చిన ట్రూడో**

కార్నీకి ముందు కెనడా ప్రధానిగా ఉన్న జస్టిన్ ట్రూడో భారత్ విషయంలో అనుసరించిన వైఖరి అందరికీ తెలిసిందే. తన అసమర్థ పాలనను కప్పిపుచ్చుకొనేందుకు, ప్రభుత్వం పడిపోకుండా కాపాడుకోవడానికి, సొంత ఎంపీల్లో పెరుగుతున్న అసంతృప్తిని పక్కదోవ పట్టించడానికి ఖలిస్థానీ వేర్పాటువాదులకు ట్రూడో మద్దతు పలుకుతూ, భారత వ్యతిరేక భావజాలాన్ని కెనడాలో వ్యాప్తి చేశారు. ఓ దేశాధినేతగా కాకుండా ఓ ఫక్తు రాజకీయ నాయకుడిగా వ్యవహరించారు. ఖలిస్థానీ వేర్పాటువాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యను భారత ప్రభుత్వంపై నెట్టేసి, రాజకీయ లాభం కోసం అక్కడి సిక్కుల్లో విద్వేషాగ్నులను రగిల్చే ప్రయత్నం చేశారు. అంతర్జాతీయ సంబంధాల్లో ఇలాంటి వైఖరి సరికాదని తెలిసినా తన స్వార్థ ప్రయోజనాల కోసం రెండు దేశాల మధ్య సంబంధాలను సైతం పణంగా పెట్టడానికి ట్రూడో వెనుకాడలేదు. అయితే ఏ రాజకీయ ప్రయోజనాలను ఆశించి ఆ శత్రుత్వాన్ని ట్రూడో పెంచారో అవి మాత్రం ఆయనకు దక్కలేదు. సొంత పార్టీ నేతలే ఆయన్ను పదవి నుంచి దింపేశారు. ఆ తర్వాత అధికార లిబరల్ పార్టీ నేతగా మార్క్ కార్నీ ఎంపికై ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. ఆ వెంటనే కార్నీ ఎన్నికలు నిర్వహించి, పార్టీని విజయపథంలో నడిపి మళ్లీ ప్రధాని పగ్గాలు చేపట్టారు. ఎన్నికల ప్రచారంలో కూడా భారత్‌తో సంబంధాలను పునరుద్ధరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

**కార్నీది భిన్నవైఖరి**

కార్నీకి కూడా రాజకీయ ప్రాధాన్యాలున్నా, ట్రూడోలా ఖలిస్థానీ వేర్పాటువాదులను వెనకేసుకురాలేదు. భారత్ వ్యతిరేక భావజాలాన్ని పెంచి పోషించలేదు. పైగా తన మంత్రిమండలిలో భారత సంతతికి చెందిన నలుగురికి చోటు కల్పించారు. కీలకమైన విదేశాంగశాఖ మంత్రి పదవి అనితా ఆనంద్‌కు ఇచ్చారు. క్యాబినెట్ కూర్పుతోనే తాను ట్రూడోలా వ్యవహరించబోనన్న సంకేతాలనిచ్చారు. ఖలిస్థానీ అనుకూల సంస్థల కోసం ప్రపంచంలో ఐదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థైన భారత్‌ను కెనడాకు దూరం చేసే ఉద్దేశాలు తనకు లేవన్న విషయాన్నీ స్పష్టం చేశారు. కార్నీ స్వతహాగా బ్యాంకర్. గతంలో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్, బ్యాంక్ ఆఫ్ కెనడాలకు గవర్నర్‌గా విధులు నిర్వహించిన అనుభవం ఉంది. ప్రస్తుత బహుళ ధ్రువ ప్రపంచంలో భారత మార్కెట్ ఎంత విలువైందో ఆయనకు తెలుసు. అందుకే కెనడా ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొనే మోదీకి ఆహ్వానం పలికారు. దీనిపై ఖలిస్థానీ అనుకూల సంస్థలు చేస్తున్న వీరంగాన్ని ఆయన పట్టించుకోలేదు. దేశహితాన్ని దృష్టిలో ఉంచుకొనే మోదీని పిలిచానని స్పష్టంచేశారు. ప్రపంచంలోనే భారత్ అతి పెద్ద ప్రజాస్వామ్యదేశం అని వారికి గుర్తు చేశారు.

**ఆ ఫోన్‌కాల్‌లోనే..!**

కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్‌కు గత వారం భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ ఫోన్ చేశారు. ఆ సమయంలోనే ట్రూడో పాలనలో దెబ్బతిన్న ద్వైపాక్షిక సంబంధాలను గాడిలో పెట్టాలన్న విషయంపై ఇరు దేశాలు ఓ అంగీకారాన్ని వచ్చాయి. ఆ ఫోన్‌కాల్‌లోనే భారత్ జీ7 ఆహ్వానం కూడా ఖరారైందని ఇప్పుడు వార్తలొస్తున్నాయి. న్యూదిల్లీతో సంబంధాలు మెరుగుపరచుకోవడం కోసం కెనడా ఎదురుచూస్తోందని జైశంకర్‌తో ఫోన్ సంభాషణ అనంతరం అనిత ఓ ఇంటర్వ్యూలో అన్నారు. నిజ్జర్ హత్యకు.. భారత్‌కెనడా ద్వైపాక్షిక సంబంధాలకు ముడిపెట్టబోమని అన్నారు. నిజ్జర్ కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందని తెలిపారు. జీ7లో సభ్యదేశం కాకపోయినా 2019 నుంచి ఆ గ్రూపు శిఖరాగ్ర సదస్సులకు భారత్‌కు ఆహ్వానం అందుతూనే ఉంది. ఈ నెల 15 నుంచి 17 వరకు కెనడాలోని జరగనున్న ఈ సదస్సు ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో మనకు చాలా కీలకం. పాక్ ఉగ్ర కుట్రలను ప్రపంచానికి మరింత బలంగా తెలియచెప్పే అవకాశాన్ని ఈ వేదిక కల్పించనుంది. అంతేకాదు, ట్రూడో హయాంలో పెరిగిన శత్రుత్వాన్ని పక్కనపెట్టి భారత్‌కెనడా సంబంధాలను మళ్లీ గాడిలో పెట్టడానికీ మోదీ కెనడా పర్యటన దోహదపడనుంది.

# ఎమ్మెల్యేలు గాడి తప్పితే వదులుకోవడానికీ సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నవారిని ఉపేక్షించబోనని, అవసరమైతే వారిని వదులుకోవడానికీ సిద్ధమని ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించారు. 'మీలో కొందరు వన్‌టైమ్ ఎమ్మెల్యేలుగా మిగిలిపోవాలనుకుంటే అది మీ ఇష్టం' అని వ్యాఖ్యానించారు. అందరి జాతకాలూ తనవద్ద ఉన్నాయని, వారి పనితీరు, వ్యవహారాలపై ఎప్పటికప్పుడు సర్వే నివేదికలు, సమాచారం తెప్పిస్తున్నానని తెలిపారు. కొందరు బాగా పనిచేస్తున్నారంటూ వారిని అభినందిస్తూనే, గాడి తప్పిన నేతలను ఉపేక్షించబోనని గట్టిగా హెచ్చరించారు. ఒకరిద్దరి కోసం పార్టీ, ప్రభుత్వ ప్రయోజనాలను పణంగా పెట్టలేనన్నారు. అలాంటివారిని దూరంగా పెడతానని, వారిని వదులుకునేందుకూ సిద్ధమని ఒకటికి రెండుసార్లు స్పష్టంచేశారు. త్వరలోనే ప్రతి ఎమ్మెల్యేతో ముఖాముఖి భేటీలు నిర్వహిస్తానని, వారి పనితీరుపై నివేదికలు త్వరలో వ్యక్తిగతంగా అందజేస్తామన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలతో చంద్రబాబు శనివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పనిచేసినవారికి గుర్తింపు, మెరుగైన అవకాశాలు ఉంటాయని చెబుతూ, పనిచేయనివారి విషయంలో 1995 నాటి విధానం అమలు చేస్తానని తెలిపారు.

**జాగ్రత్తగా ఉండండి..**

'మొదటిసారి గెలిచిన ఎమ్మెల్యేలు మరింత బాధ్యతగా పనిచేయాలి. ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండాలి. ఎమ్మెల్యేగా గెలిచాం కదా.. అని ఎవరైనా అతివిశ్వాసంతో వ్యవహరిస్తే వారికే ఎక్కువ నష్టం జరుగుతుంది. మీరు వన్‌టైం ఎమ్మెల్యేలుగా మిగిలిపోరాదన్నది నా ఆలోచన. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు మనల్ని గమనిస్తుంటారు. గత ప్రభుత్వాన్ని భరించలేకే ప్రజలు మనకు ఏకపక్షంగా ఓట్లేసి గెలిపించారు. ప్రజలు శాశ్వతంగా మనతో ఉండేలా చూసుకోవాలి. వారిలో నమ్మకాన్ని కలిగించాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఎంపీలు, ఎమ్మెల్యేల పనితీరుపై సర్వే చేయించి నివేదికలు తెప్పించుకుంటున్నాను. మంచి చేస్తే మరిన్ని అవకాశాలు కల్పిస్తాను. తప్పు చేస్తే దూరం పెడతాను. మెజారిటీ ఎంపీలు, ఎమ్మెల్యేలు వారి పనితీరుతో ప్రజలకు చేరువయ్యారు. వారి వల్ల పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు వస్తోంది. ఒకరిద్దరి వల్ల అక్కడక్కడ నష్టం కూడా జరుగుతోంది. ఏ ఒక్కరి చర్యల వల్ల అయినా వ్యవస్థకు నష్టం జరుగుతుందంటే అంగీకరించేది లేదు. ప్రజాప్రతినిధులుగా మీరు నిత్యం ప్రజల్లో ఉండాలి. విమర్శలకు, వివాదాలకు, ఆరోపణలకు దూరంగా ఉండాలి' అని చంద్రబాబు స్పష్టం చేశారు. కొన్ని సందర్భాల్లో పరిపాలనలో తప్పులు, అధికారుల తీరు వల్ల కూడా ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని, ఈ విషయంలో మంత్రులు మరింత బాధ్యతగా ఉండాలని, తెలిసి చేసినా తెలియక చేసినా తప్పు తప్పేనని అన్నారు.

**12న విజయోత్సవ ర్యాలీలు**

ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా ఈ నెల 12న 175 నియోజకవర్గాల్లోనూ విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాలని సీఎం సూచించారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు అమరావతిలో మంత్రులు, కూటమి ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏడాదిలో స్పష్టమైన మార్పు చూపించామన్నారు.

*** వైకాపా నాయకులు రాక్షసుల్లా అడ్డుకుంటున్నారు**

'వైకాపా ప్రభుత్వ విధ్వంసకర పాలన వల్ల ప్రజలు భయంకర పరిస్థితుల్ని చూశారు. రాష్ట్రం పేరు వింటేనే పెట్టుబడిదారులు పారిపోయే దుస్థితిని వైకాపా ప్రభుత్వం కల్పించింది. అసమర్థ పాలనతో రాష్ట్రాన్ని ఆర్థికంగా అధఃపాతాళంలోకి తొక్కేశారు. అయినా మనం సమస్యలను చూసి పారిపోలేదు. ఏడాదిలో చాలా మార్పు తెచ్చాం. మనం తీసుకున్న నిర్ణయాలతో మంచి ఫలితాలు వస్తున్నాయి. ప్రజలకు మనం చేస్తున్న మంచి చెప్పాలి. వైకాపా ప్రభుత్వ అరాచకాలను గుర్తుచేయాలి' అని సీఎం పేర్కొన్నారు. 'గత పాలకులు విధ్వంసం చేసిన రాష్ట్రాన్ని సర్వశక్తులూ ఒడ్డి ముందుకు తీసుకెళుతున్నాం. ఆ ఫలితాలను అడ్డుకోవడానికి వైకాపా నాయకులు రాక్షసుల్లా ప్రవర్తిస్తున్నారు. అయినా రాష్ట్ర పునర్నిర్మాణ యజ్ఞం ఆగదు' అని ఆయన స్పష్టంచేశారు.

*** పదవుల కంటే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం**

'మనకు పదవుల కంటే రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం. నేను దిల్లీ వెళ్లిన ప్రతిసారీ కేంద్రమంత్రుల్ని కలిసి అదే చెబుతున్నాను. రాష్ట్రానికి చేయూతనివ్వాలని కోరుతున్నాను. పోలవరంబనకచర్ల అనుసంధానంతో అద్భుత ఫలితాలు వస్తాయి. దానివల్ల తెలంగాణకు ఎలాంటి నష్టం జరగదు. సముద్రంలో వృథాగా కలిసే 3 వేల టీఎంసీల గోదావరి జలాల్లో 200 టీఎంసీలనే మనం వినియోగించుకుంటాం. తెలుగు ప్రజలు ఎక్కడ ఉన్నా నాకు అందరూ ముఖ్యమే. తెలంగాణ ప్రభుత్వం గోదావరి నదిపై కట్టిన ఏ ఒక్క ప్రాజెక్టునూ తెదేపా వ్యతిరేకించలేదు. కొందరు సెంటిమెంట్‌ను రెచ్చగొట్టాలని చూస్తున్నారు' అని పేర్కొన్నారు. ఈ నెల 21న విశాఖలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పార్టీ శ్రేణులు భాగస్వాములై, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విశాఖలో 5లక్షల మందితో యోగాడే నిర్వహిస్తున్నామని, అదేరోజు రాష్ట్ర వ్యాప్తంగా ఆ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

# సంవత్సన్నర కాలంగా రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుంది

*** బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : గత సంవత్సన్నర కాలంగా రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. శనివారం నగరంలోని తెలంగాణ భవన్ లో బిఆర్ఎస్ పార్టీ అధినేత, కేసీఆర్ చావును కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలపై చేసిన బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత , ఇతర నాయకులతో కలిసి రేవంత్ రెడ్డి భాష, ప్రభుత్వ పాలన తీరుపై విలేకరుల సమావేశంలో తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ గత సంవత్సన్నర కాలంగా రేవంత్ రెడ్డి చేసింది ఏమీలేక, చేసేది ఏమి లేక కెసిఆర్ ని తిట్టడమే పనిగా పెట్టుకొని, కెసిఆర్ పేరు లేకుండా ఒక్క ఉపన్యాసం లేదన్నారు. కొత్తగా ప్రభుత్వం ఏర్పడితే ప్రభుత్వ లక్ష్యాలు, పాలసీలను చెప్పాలి. కానీ రేవంత్ రెడ్డికి పాలన చేతకాక, ఒక దద్దమ్మ లాగా తిట్ల పురాణంతో చావు కోరుకుంటూ పదేపదే నీ భాషతో రాష్ట్ర ఖ్యాతిని దిగజారిస్తున్నావన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఓటుకు నోటు, తెలంగాణ భూతం లాగా తయారయ్యిండన్నారు. రేవంత్ రెడ్డి నీకు దమ్ముంటే ఆరుగురు మంత్రులను భర్తీ చెయాలని డిమాండ్ చేశారు. ఆసర్లకు సాధ్యం కానీ గద్దెనెక్కిన అని అనేది నిన్నటి ఈ సందేశంలో తేటతెల్లమైందన్నారు. 420 అబద్ధపు హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తొ ఉంటే చావు భాష, బజారు భాష, డైవర్షన్ పాలిటిక్స్ తో ఈ బూతుల పురాణానికి లేపుతున్నారన్నారు. కెసిఆర్ ది బాగు కోరే భాష, రేవంత్ రెడ్డిది చావుకోరే భాష అన్నారు. నీ తిట్లు మీ వినాశనానికి మెట్లు కాబోతున్నాయన్నారు. సంవత్సరన్నర కాలంలో రాష్ట్ర ఖ్యాతిని అపఖ్యాతి పాలు చేసి పబ్బం గడుపుకుంటున్నారన్నారు. ఇంకా వీళ్లకు పది సంవత్సరాల టైం కావాలంటా అన్నారు. తిట్ల ట్రాప్ లో పడము, గల్లా పట్టి మీరు ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేపించే బాధ్యత బిఆర్ఎస్ తీసుకుంటుందని కాంగ్రెస్ పార్టీని హెచ్చరించారు. అబద్దాల పునాదులపై ఏర్పడ్డ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. అందాల పోటీలు పెట్టి రాష్ట్రం, దేశ ప్రతిష్టను దిగజార్చారు కాంగ్రెస్ పార్టీ నాయకులన్నారు. పిసిసి అధ్యక్షుడు పిశాచి కాంగ్రెస్ కమిటీల కనబడుతున్నాడు. ఆచరణకు సాధ్యం కానీ హామీలతో, ఇష్టా రీతిగా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రిని నిలదీయలేని నిస్సహాయ స్థితిలో పిసిసి అధ్యక్షులు ఉన్నారన్నారు. గతంలో ఎంతోమంది పిసిసి అధ్యక్షులను చూశాము, వారు ముఖ్యమంత్రి నిర్ణయాలను ఒకో సమయంలో నిలదీసేవారన్నారు. ఇప్పుడున్న డమ్మీ పిసిసి అధ్యక్షుడు మేము అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక సీఎం కి పాట పాడుతూ వత్తాసు పలుకుతున్నారన్నారు. గత సంవత్సరన్నర కాలంగా తెలంగాణ సమాజం బాధపడుతున్నది రేవంత్ రెడ్డి మాటలు చూసి. సరైన సమయం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. మీరు ఇచ్చిన అబద్ధపు హామీలు, మీ పనులు, మీ మాటలను ప్రజలకు వివరించి తప్పకుండా గుణపాఠం చెప్పే విధంగా బిఆర్ఎస్ సంసిద్ధంగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీని హెచ్చరించారు.

## బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కి స్వదేశీ ఆగమన శుభాకాంక్షలు



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : విదేశీ పర్యటనలో భాగంగా యూకె, యూఎస్ఏ దేశాలలో పర్యటించి డల్లాస్ నగరంలో బిఆర్ఎస్ పార్టీ ఎన్నారై విభాగం వారి అధ్వర్యంలో నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలను దిగ్విజయంగా పూర్తి చేసుకొని హైదరాబాద్ నగరానికి తిరిగి వచ్చిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని శనివారం తెలంగాణ భవన్ లో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేల బృందం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ కి పుష్పగుచ్చాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కేటీఆర్ కి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేష్, కొత్త ప్రభాకర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మాజీ చైర్మన్ కె.రవీందర్ రావు తదితరులు ఉన్నారు.

## విద్యారంభాన్ని కష్టంగా కాకుండా ఇష్టంగా ప్రారంభించడంలో ప్లే స్కూల్ లు దోహదం

*** బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : విద్యారంభాన్ని కష్టంగా కాకుండా ఇష్టంగా ప్రారంభించడంలో ప్లే స్కూల్ లు ఎంతగానో ఉపయోగపడుతాయని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద్ అన్నారు. సుభాష్ నగర్ భాగ్యలక్ష్మి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన "అలస్కా ప్లే స్కూల్" ను శనివారం బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల విద్యా ప్రారంభంలో ఆడుతూ పాడుతూ విద్యను అభ్యసింపచేయడంలో ప్లే స్కూల్ లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.ఈ సందర్భంగా డివిజన్ మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, భాగ్యలక్ష్మి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సాగర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాములు యాదవ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కుంటి మల్లేష్, యాదగిరి, నరేందర్ రెడ్డి, ఆనంద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు ఆపన్న హస్తం సీఎంఆర్ఎఫ్:ఎమ్మెల్యే గూడెం

*** రెండు లక్షల రూపాయల విలువైన ఎల్ఓసి అందజేత**

పటాన్ చేరు,ప్రజాస్ఫూర్తి 07: ఆపద కాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఆపన్న హస్తం అందిస్తోందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ జయలక్ష్మి నగర్ కాలనీకి చెందిన కె. పున్నయ్యగత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో మెరుగైన వైద్య కోసం స్థానిక ఎమ్మెల్యే ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు వైద్యం కోసం మంజూరైన రెండు లక్షల రూపాయల విలువైన ఎల్ఓసి అనుమతి పత్రాన్ని ఎంఎల్ఏ

## దైవ చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుంది

*** బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : దైవ చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ వెంకటేశ్వర నగర్ లోని శ్రీ హరి హర అభయాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న అభయాంజనేయ దేవాలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాలకు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, డివిజన్ మాజీ కార్పొరేటర్ కె.ఎం. గౌరీష్ లు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభయాంజనేయ స్వామి దయతో ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో జీవించాలన్నారు. అంతకు ముందు నూతనంగా నిర్మించనున్న దేవాలయ కమాన్ పనులకు ఎమ్మెల్యే, కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. అనంతరం దేవాలయ అభివృద్ధికి పాటు పడుతున్న కాలనీవాసులను ఎమ్మెల్యే సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మధుకర్ రెడ్డి, కోశాధికారి జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి మనోహర్, సభ్యులు మహేష్ కుమార్, కృష్ణా రెడ్డి, సురేందర్ రెడ్డి, బాలకృష్ణ, శ్రీధర్ రెడ్డి, నాగదీప్ గౌడ్, బజారెడ్డి, వార్త శ్రీను, మూర్తి, నరసింహ, నర్సింగరావు, రాంబాబు, జగదీశ్వర్, పుండరీకం, మధు, త్రిమూర్తులు, వి.శ్రీనివాస్, భగవాన్ రెడ్డి, గిరి, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## త్యాగం, ప్రేమ, సమానత్వానికి ప్రతీక బక్రీద్

*** బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : త్యాగం, ప్రేమ, సమానత్వానికి ప్రతీక బక్రీద్ అని బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ అన్నారు. శనివారం చింతల్ డివిజన్ హెచ్ఎంటీ కాలనీలో కుత్బుల్లాపూర్ మండల్ అహ్లే హదీస్ ఈద్గా సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బక్రీద్ ప్రత్యేక ప్రార్థనల్లో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పాల్గొని ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ బక్రీద్ పర్వదినాన ముస్లిం సోదరులు మేకలు, గొర్రెలను ఆ అల్లాకు బలిచి అందులో ఒక భాగాన్ని పేదలకు, మరో భాగాన్ని బంధుమిత్రులకు, మూడవ భాగాన్ని కుటుంబ సభ్యులకు పంచుతూ త్యాగం, ప్రేమ, సమానత్వానికి ప్రతీకగా బక్రీద్ నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మండల్ అహ్లే హదీస్ ఈద్గా సొసైటీ సలహాదారులు ఎండి. హమీద్, అడ్వకేట్ హుస్సేన్, ఎండీ. అబ్దుల్ రజాక్, ఎండి.ఇబ్రహీం, అక్బర్ ఖాన్, ప్రెసిడెంట్ ముహమ్మద్ ఆదిల్, ఉపాధ్యక్షులు ఎండి. ఇబారత్, ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హకీమ్, కోశాధికారి ఎండి. సిరాజ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ అబ్దుల్ బరి తదితరులు పాల్గొన్నారు.



## సమర్ధవంతమైన పాలన అందిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ

*** బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్**

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ప్రధాన మంత్రిగా నరేంద్ర మోడీ దేశంలో సమవర్ధవంతమైన పాలన అందిస్తున్నారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్ అన్నారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో బిజెపి పార్టీ కార్యశాల కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షుడు సౌల్ల క్రాంతి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. నరేంద్ర మోడీ ప్రధానిగా 11 సంవత్సరాల పాలన పూర్తి అయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం సాధించిన విజయాలను, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రతి పౌరుడికి చేరవేయాలని, వికసిత్ భారత్ దార్శనికతల కార్యక్రమాలను అన్ని గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు వివరించాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోడీ నిర్ణయాత్మక నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలో 4 వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని, వికసిత్ భారత లక్ష్యం సాకర దిశగా, ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగుతూ, ఎన్నో చారిత్రాత్మక విజయాలతో మోడీ ప్రభుత్వం 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా యావత్ దేశం ప్రధానికి అభినందనలు తెలుపుతుందన్నారు. ఆపరేషన్ సింధూర్ పేరుతో ప్రపంచ దేశాలకు మన బలమేంటో చూపించి, ఉగ్రవాదుల శిబిరాలను ధ్వంసం చేసి నూతన ఒరవడి సృష్టించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కరెడ్ల మల్లారెడ్డి, జిల్లా కౌన్సెల్ మెంబర్ మెరుగు అంజా గౌడ్, చిట్నేని శ్రీనివాస రావు, మెంగని మహేందర్, బిజెవైఎం జనార్ధన్, బాధ నరేష్, చిగురు వెంకన్న, కోల కృష్ణ, గోపి, గూడ బాల్ రెడ్డి, చీకొటి మహేష్, ప్రభాకర్ రెడ్డి, మీసా శంకర్, బట్టు ప్రశాంత్, దీటి సత్తయ్య, బుర్ర శ్రీను, కాసరపు రవి, పీరాల విజయ్, కట్ల అజయ్, పేంటం నరేష్, దుంపలపల్లి అజయ్ తదితరులున్నారు.

## అనారోగ్య బాధితుడి పరామర్శ



జిన్నారం,ప్రజాస్ఫూర్తి 07: జిన్నారం మండల భారతీయ జనతా పార్టీ మండల శాఖ ప్రధాన కార్యదర్శి దాదిగూడెం గ్రామానికి చెందిన ఎంకిరి గారి వెంకటేష్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డాక్టర్ సి అంజి రెడ్డి ఆయన ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. రెండు నెలలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వెంకటేష్ కు 20వేల ఆర్థిక సహాయాన్ని అందించారు.కార్యకర్తకు ఆపద వచ్చినా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకుడు ప్రతాప్ రెడ్డి, మండల అధ్యక్షుడు కే జగన్ రెడ్డి దోమడుగు రమేష్ పల్నాటి శ్రీనివాస్ అశోక్ కృష్ణ పాల్గొన్నారు

## జీవితంపై విరక్తి తో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన పెరుమాండ్ల క్రిష్ణ (50) 4 సంవత్సరాల క్రితం తన కూతురు పెండ్లి సమయంలో 4లక్షల వరకు అప్పులు చేసి పెండ్లి చేశాడని, అప్పులు ఎలా తీర్చాలో బాధ పడుతుండేవాడని, రోడ్డు ప్రమాదంలో చేయి సైతం విరిగింది. దీంతో ఆరోగ్య బాగుండక పోవడం, తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కాక, జీవితంపై విరక్తి చెంది ఇంటి నుంచి తెరుమద్దికి వెళ్లి అక్కడ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఈ మేరకు మృతుని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గణేష్ తెలిపారు.

## మంత్రిని కలిసిన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ను కాంగ్రెస్ ముస్తాబాద్ పట్టణ అధ్యక్షుడు గజ్జల రాజు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి శాలువా కప్పి, పూలబొకే అందజేసి సన్మానించారు. మండలంలోని పలు సమస్యలపై ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి చేరవేస్తూ పార్టీని మరింత బలోపేతం చేస్తున్నామని మంత్రికి తెలిపారు.

## త్యాగానికి, సామరస్యానికి ప్రతీక బక్రీద్

*** కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : త్యాగానికి, సామరస్యానికి ప్రతీక బక్రీద్ పండుగ అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని శనివారం పట్టణ పరిధిలోని బొడగుట్ట ఈద్గా మైదానంలో జరిగిన ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొన్నారు. ముస్లీం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ప్రజాస్వామ్య భారత దేశంలో అన్ని పండుగలకు కులమతాలకతీతంగా జరుపుకోవడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, సబ్ డివిజన్ పోలీస్ అధికారి రహమాన్, మైనార్టీ సంఘాల రాష్ట్ర నాయకులు డాక్టర్ నయీమ్ ఖురేషి, నాయకులు వాసిరెడ్డి మురళి, అన్వర్ అలీ, అమీర్ ఖాద్రి, అయుబ్, ఇస్మాయిల్ ఖాన్, అబ్దుల్ రబ్, ఆబిద్ హుస్సేన్, కరీం పాషా, జావేద్, తదితరులు పాల్గొన్నారు.




# దొంగలున్నారు జాగ్రత్త!...

* **జగద్గిరిగుట్టలో బైక్ దొంగల చేతివాటం!:**
* **రాత్రి వేళల్లో పార్కింగ్ చేసిన టూ వీలర్ లే లక్ష్యంగా....!:**
* **జెర భద్రం బిడ్డో అంటున్న పెద్దలు:**
* **స్వీయ భద్రతే శ్రీ రామ రక్ష:**
* **సీసి కెమెరాల ఏర్పాటు లో వైఫల్యం!:**
* **ఉత్సవ విగ్రహాల్లా సంక్షేమ సంఘాల నాయకులు:**

ప్రజాస్ఫూర్తి, జగద్గిరిగుట్ట :రాత్రి వేళల్లో మీ ఇంటి ముందే పార్కింగ్ చేసిన మీ బైక్ ఉదయం మీకు కనిపించకపోవచ్చు!తాళం వేసామని ధీమాగా పడుకున్నా అర్ధరాత్రి పీడకలలా వచ్చి మీ బైక్ ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లవచ్చు.ఇధీ జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని బస్తిలు, కాలనీల ప్రజల పరిస్థితి. ఇటీవల జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ కు కూతవేటు దూరంలో ఉన్న రాజీవ్ గృహకల్పలో ఒక దొంగ దర్జాగా పార్కింగ్ చేసిన బైక్ ల వద్ద అటుఇటూ తిరిగి తనకు నచ్చిన బైక్ తాళం అవలీలగా తీసి దొంగతనం చేసిన వీడియో వాట్సాప్ గ్రూప్ లలో వైరల్ అయింది! దీంతో పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు బస్తిలు, కాలనీల ప్రజలు తమ ఇండ్ల ముందు బైక్ లు పార్క్ చేయాలంటేనే రాత్రి వేళల్లో ఏ క్షణాన తమ బైక్ లు ఎవరు ఎత్తుకెళ్తారోననే భయందోళనలో వున్నారు! పైసా పైసా కూడబెట్టి ఎంతో ఇష్టంగా కొనుకున్న బైక్ లు ఎత్తుకెళ్లకుండా ఎలా కాపాడుకోవాలో అని స్థానికులు చర్చించుకుంటున్నారు! బైక్ లకే పరిమితమా.....?:జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగలు బైక్ లకే పరిమితమా లేదా తాళం వేసి వున్న ఇళ్లలో కూడా చోరికి తెగబడతారా అని స్థానికులు చర్చించుకుంటున్నారు! దొంగతానాని పాల్పడే సమయంలో ఎవరైనా వారిని గమనించి మందలిస్తే దుండగులు దాడికి సైతం దిగే ప్రమాదం వుంది.ఈజీ మని కోసమో, జల్సాల కోసమో దొంగతనాలకు పాల్పడేవారు తప్పనిసరిగా రాత్రి వేళల్లో తమను ప్రశ్నించిన వారిపై ఎంతటి దాడి కైనా తెగబడే ప్రమాదం పొంచి వుంది! సంక్షేమ సంఘాలు ఏం చేస్తున్నాయి?:జగద్గిరిగుట్ట లో పోలీస్ స్టేషన్ ప్రారంభమైన నాటి నుండి ఈ ప్రాంతంలో పనిచెసిన స్టేషన్ ఆఫీసర్ లు, ఎస్ఐ లు తమ స్టేషన్ పరిధిలోని బస్తీలు, కాలనీలలో ప్రజా భద్రత కోసం, నేరాల నియంత్రణ కోసం సీసి కెమెరాల అవశ్యకత గురించి సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కార్యక్రమం కల్పించే ప్రయత్నం చేస్తున్నారు.కానీ దేవమ్మ బస్తి, అంజయ్య నగర్, మైసమ్మ నగర్ వంటి ఒకటీ రెండు బస్తిలు మినహా ఆశించిన స్థాయిలో బస్తీలు, కాలనీలలో కెమెరాలు ఏర్పాటు కాలేదు! పండగలు, వేడుకల్లో బస్తీల ప్రజలను ఏకం చేసి ధూమ్ ధామ్ గా వేడుకలు నిర్వహించే సంక్షేమ సంఘాల నాయకులు తమ బస్తి ప్రజల భద్రతను మాత్రం గాలికొదిలేస్తున్నారనే విమర్శలు వెళ్ళువెతుతున్నాయి.ప్లాట్ లు కొనాలంటే, అమ్మాలంటే తమను సంప్రదించాలని వాల్ రైటింగ్ ద్వారా ప్రచారం చేసే కాలనీల నాయకులు కొంత చొరవ తీసుకొని కెమెరాలు ఏర్పాటు చేసి ఈ బస్తీ నిఘా నీడలో వుంది జాగ్రత్త అని సూచిక బోర్డులు, వాల్ రైటింగ్ ద్వారా ఆ ప్రాంతానికి వచ్చేవారికి కనిపించేలా చేస్తే ఆ బస్తి, కాలనీలలో దొంగతనం చేసేందుకు ఏ దుండగుడు సాహసించడు కదా!ఎందుకంటే రెక్కి నిర్వహించే సమయంలోనే ఆ ప్రాంతంలో కాలనీలో కెమెరాలు ఉన్నాయనే విషయం తెలిస్తే ఎంతటి ఘనపాటి దొంగ అయినా అటువైపు మళ్ళీ కన్నెత్తి చూసే సాహసం చేస్తాడా.....?





## కూకట్ పల్లి రాందేవ్ రావ్ ఆసుపత్రి కి హరిత పురస్కారం



కూకట్ పల్లి, ప్రజాస్ఫూర్తి : ప్రకృతిని పరి రక్షించే దిశగా అంకితభావంతో చేసిన కృషికి గుర్తింపుగా రాందేవ్ రావ్ ఆసుపత్రి కి హరిత పురస్కారం లభించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా యశోద హాస్పిటల్ , హెల్ప్ ఆర్గనైజేషన్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో కూకట్ పల్లి రాం దేవ్ రావు ఆసుపత్రికి హరిత పురస్కారాన్ని రాందేవ్ రావ్ ఆసుపత్రి తరుపున ఈ అవార్డు ని సీఈఓ డాక్టర్ ఎన్.యోబు, డాక్టర్. స్వాతి రెడ్డి లు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆసుపత్రి కి హరిత పురస్కారం లభించడంతో ఎంతో గర్విస్తున్నామన్నారు. కూకట్ పల్లి లో రాందేవ్ ఆసుపత్రి ని కూకట్ పల్లి ఊపిరితిత్తులు గా అభివర్ధించడం జరిగిందన్నారు. ఈ పురస్కారం పచ్చదనం పరిరక్షణ గురించే కాకుండా సెఫ్ బయో మెడికల్ వాడకం, ఎస్టీపీ, సోలార్ వాడకం గురించి కూడా పరిణలోకి తీసుకొని ఇవ్వడం జరిగిందన్నారు. పర్యావరణ పరిరక్షణ, మొక్కల నాట్లు, ఆకుపచ్చ పరిసరాల ఏర్పాటులో మా సంస్థ చేసిన నిరంతర శ్రమకు ఈ పురస్కారం ఒక ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఈ గౌరవం మాకు లభించినందుకు అందరికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ విజయానికి తోడ్పడిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా మరింత ఉత్సాహంగా పర్యావరణ హిత కార్యకలాపాలు కొనసాగిస్తామన్నారు.

## నేడు పోలీస్, సింగరేణి జట్ల మధ్య తుదిపోరు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పహల్గాం ఉగ్రదాడులకు ప్రతీకారంగా ఇండియన్ ఆర్మీ చేపట్టిన ఆపరేషన్ 'సింధూర్' విజయవంతం కావడంతో భారత సైనికులకు మద్దతు తెలుపుతూ మీడియా ఎలెవెన్ ఆధ్వర్యంలో తలపెట్టిన జవాన్ కప్ తుది దశకు చేరుకుంది. ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు కొత్తగూడెం ప్రకాశం స్టేడియం వేదికగా భద్రాద్రి పోలీస్ మరియు సింగరేణి కాలరీస్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరగనుంది. గత రెండు రోజులుగా జరిగిన మ్యాచ్‌లకు భారీ స్పందన లభించింది. ప్రేక్షకులు అధిక సంఖ్యలో హాజరై మ్యాచ్‌లను తిలకిస్తూ, క్రీడాకారులను ఉత్సాహపరిచారు. క్రికెట్ పోటీల నిమిత్తం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. తుదిసమరానికి ఇరు జట్లు సిద్ధం కావడంతో మ్యాచ్ హోరాహోరీగా జరగనుంది. భారత జవాన్లకు మద్దతుగా చేపట్టిన ఈ టోర్నమెంట్ తుది పోరును వీక్షించేందుకు అధిక సంఖ్యలో వీక్షకులు ప్రకాశం స్టేడియంకు చేరుకొని తమవంతు సహాయంగా ఇండియన్ ఆర్మీ సహాయనిధికి విరాళాలు అందించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

* **సెమీఫైనల్‌లో గెలిచిన సింగరేణి, పోలీస్ జట్లు**

కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో మీడియా ఎలెవెన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జవాన్ కప్ టోర్నమెంట్ లో మ్యాచ్‌లు ఎంతో ఉత్కంఠభరితంగా సాగాయి. శనివారం సింగరేణి, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ , పోలీస్, టీచర్స్ జట్ల మధ్య రెండు సెమీ ఫైనల్స్ జరగ్గా సింగరేణి, పోలీస్ జట్లు హోరా హోరీగా పోరాడి విజయం సాధించి ఫైనల్స్‌కు చేరాయి. సింగరేణి, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ జట్ల మధ్య జరిగిన పోరులో తొలుత టాస్ గెలిచిన ఎలక్ట్రికల్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఎలక్ట్రికల్ జట్టు నిర్ణీత 5 వికెట్లు కోల్పోయి 138 పరుగులు చేసింది. ఈ జట్టులో సతీష్ 33, కృష్ణారావు 31, రామకృష్ణ 25, రవితేజ, రాంబాబు చెరొక 15 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన సింగరేణి జట్టు 14.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 141 పరుగులు చేసి విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. ఈ జట్టులో అర్జున్ 66, సాయిరాకేష్ 24, రాంరెడ్డి 16 పరుగులతో రాణించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. పోలీస్, టీచర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ ను కొత్తగూడెం డిఎస్పి రహమాన్ బ్యాటింగ్ చేసి ప్రారంభించారు.ఈ పోరులో తొలుత టాస్ గెలిచిన టీచర్స్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన పోలీస్ జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 146 పరుగులు చేసింది. జట్టులో బాల 65, నరేష్ రుద్ర 40, జి. రాజా 16 పరుగులతో రాణించారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన 14 ఓవర్లకే 88 పరుగులు చేసి అన్ని వికెట్లు కోల్పోయింది. పోలీస్ జట్టు నుంచి హనుమంతు 3, నరేష్ రుద్ర 2, రమణారెడ్డి 2, బాల, గోపాల్‌రావు, ఓంప్రకాష్, శ్రీకాంత్‌లు ఒక్కో వికెట్ చొప్పున తీశారు.సింగరేణి జట్టు లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా అర్జున్, పోలీసుల జట్టులో మ్యాన్ అఫ్ ది మ్యాచ్ గా బాల ఎంపికయ్యారు.

## బర్లిఫిట్ ఏరియాలో చైన్ స్నాచర్ కలకలం



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం పట్టణం 27 వ వార్డులోని బర్లిఫిట్ ఏరియాలో చైన్ స్నాచింగ్ ఘటన కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే బస్తీలో నివాసం ఉంటున్న శ్రీపాద పద్మ శనివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో తన ఇంటి ముందు పరిసరాలను శుభ్రం చేసుకుంటున్న సమయంలో ఒక గుర్తు తెలియని అగంతకుడు ముఖానికి కర్చీఫ్ కట్టుకొని ద్విచక్ర వాహనంపై వచ్చి తన చేతిలో ఉన్న గుడ్డతో పద్మ నోరుమూసి ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడును బలవంతంగా దొంగిలించి పారిపోయినాడు. ఘటన జరిగిన వెంటనే తేరుకున్న పద్మ గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు వచ్చేలోగా ఆ వ్యక్తి అక్కడి నుంచి పారిపోయాడు. బంగారు పుస్తెలతాడు దొంగిలించబడటంతో పద్మ లబోదిబోమని విలపిస్తుంది. విషయం తెలుసుకున్న కొత్తగూడెం వన్ టౌన్ ఎస్‌హెచ్‌ఓ కరుణాకర్ మహిళ ఇంటిని సందర్శించడం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఘటనపై విచారణ జరిపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## త్యాగం, ప్రేమ, సమానత్వానికి ప్రతీక బక్రీద్

* **ఆల్విన్ కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : త్యాగం, ప్రేమ, సమానత్వానికి ప్రతీక బక్రీద్ అని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ చౌరస్తా వద్ద ఉన్న ఈద్గా గ్రౌండ్లో ముస్లిం మైనార్టీ ,ఈద్గా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బక్రీద్ ప్రత్యేక ప్రార్థనలకు ఆయనతో పాటు యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్ లు పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. త్యాగం, ప్రేమ, సమానత్వానికి ప్రతీక బక్రీద్ పండుగ అన్నారు. కులమతాలకు అతీతంగా డివిజన్ లోని ప్రజలందరూ అన్ని పండుగలు కలిసిమెలసి చేసుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



**మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ నివాసంలో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి రామానాథ్ కోవింద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జే.కె. శేఖర్ యాదవ్ ని పరిచయం చేస్తున్న ఎంపీ ఈటెల**

**- జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి)**



**త్రిపుర గవర్నర్ ఇంద్ర సేన రెడ్డి ని బిజెపి ఓబీసీ మోర్చా తెలంగాణ బృందం శనివారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు.**

**- జగద్గిరిగుట్ట,( ప్రజాస్ఫూర్తి):**

## నిరుపేదలకు ఆపన్న హస్తం సీఎంఆర్ఎఫ్:ఎమ్మెల్యే గూడెం

* **రెండు లక్షల రూపాయల విలువైన ఎల్ఓసి అందజేత**

పటాన్ చేరు,ప్రజాస్ఫూర్తి 07: ఆపద కాలంలో ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఆపన్న హస్తం అందిస్తోందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ జయలక్ష్మి నగర్ కాలనీకి చెందిన కె. పున్నయ్యగత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో మెరుగైన వైద్య కోసం స్థానిక ఎమ్మెల్యే ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు వైద్యం కోసం మంజూరైన రెండు లక్షల రూపాయల విలువైన ఎల్ఓసి అనుమతి పత్రాన్ని ఎంఎల్ఏ జిఎంఆర్ చేతుల మీదుగా పున్నయ్య కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని తెలిపారు. పూర్తి పారదర్శకతతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజా పాలన అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జగన్, తదితరులు పాల్గొన్నారు.



# ఏపీ సచివాలయంలో ఉద్యోగాలంటూ ఘరానా మోసం

* **సెక్రటేరియట్‌లో ఉద్యోగాలంటూ నిరుద్యోగుల నుంచి రూ.53 లక్షల వసూలు**
* **ఏడుగురు యువకులకు నకిలీ అపాయింట్‌మెంట్ పత్రాలు అందజేత**
* **విజయనగరంలో నలుగురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు**
* **ముఠా నుంచి రూ.6 లక్షల నగదు స్వాధీనం, పరారీలో మరికొందరు**
* **ఫేస్‌బుక్ ద్వారా మోసానికి పాల్పడిన కీలక సూత్రధారి**
* **హైదరాబాద్ కేంద్రంగా నకిలీ ఐడీ కార్డులు, పత్రాల తయారీ**

ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి, ఏడుగురు నిరుద్యోగ యువకుల నుంచి ఏకంగా రూ.53 లక్షలు కొల్లగొట్టిన ఓ మోసపూరిత ముఠా గుట్టును విజయనగరం పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించి నలుగురు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.6 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ ఎం. శ్రీనివాసరావు నేడు మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు.

* **ఫేస్‌బుక్‌లో ప్రకటనతో మొదలైన మోసం**

విజయనగరం పట్టణంలోని ప్రదీప్ నగర్‌కు చెందిన కె. సాయి వెంకట్ సుజిత్ అనే వ్యక్తి ఈ మోసానికి ప్రధాన సూత్రధారి అని పోలీసులు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని, ఆసక్తి కలిగిన వారు తనను సంప్రదించాలంటూ సుజిత్ ఫేస్‌బుక్‌లో ఒక పోస్టు పెట్టాడు. ఈ ప్రకటన చూసిన విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి జిల్లాలకు చెందిన ఏడుగురు నిరుద్యోగ యువకులు సుజిత్‌ను సంప్రదించారు. విజయవాడలోని సచివాలయంలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగాలు కచ్చితంగా ఇప్పిస్తానని వారిని నమ్మించాడు. ఈ క్రమంలో వారి




నుంచి విడతలవారీగా మొత్తం రూ.53 లక్షలు వసూలు చేశాడు. అనంతరం, వారికి నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు సృష్టించి అందజేశాడు. బాధితులను నమ్మించేందుకు, ఈ ముఠా సభ్యులు ఏడుగురు యువకులను విజయవాడకు తీసుకువెళ్లి, అక్కడ నెల రోజుల పాటు ఉంచారు. త్వరలోనే ఉద్యోగంలో చేరే సమాచారం వస్తుందని చెప్పి వారిని వెనక్కి పంపించేశారు. అయితే, ఎంతకాలం ఎదురుచూసినా ఎలాంటి సమాచారం రాకపోవడంతో తాము మోసపోయామని గ్రహించిన బాధితులలో ఒకరైన ఎస్.కోటకు చెందిన ఎస్. వినోద్, విజయనగరం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన సీఐ ఎస్. శ్రీనివాస్ కేసు నమోదు చేసి, దర్యాప్తు ముమ్మరం చేశారు.

* **పక్కా సమాచారంతో నిందితుల అరెస్ట్**

పోలీసుల విచారణలో ఈ ముఠాలో మొత్తం తొమ్మిది మంది సభ్యులు ఉన్నట్లు తేలింది. వీరిలో ఐదుగురు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు కాగా, నలుగురు హైదరాబాద్ వాసులుగా గుర్తించారు. తమపై కేసు నమోదైందని తెలియగానే నిందితులు పరారయ్యారు. అయితే, ముఠాలో కీలక నిందితుడైన సాయి వెంకట్ సుజిత్‌కు అనారోగ్యంగా ఉందని, అతడిని చూసేందుకు మిగిలిన నిందితుల్లో కొందరు సీహెచ్ మహేష్, రూబిన్ కుమార్, జాన్, యాకూబ్ విజయనగరం వస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు, విజయనగరం రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో మాటువేసి, చాకచక్యంగా వ్యవహరించి ఆ నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు తమ నేరాన్ని అంగీకరించినట్లు డీఎస్పీ తెలిపారు. నకిలీ ఐడీ కార్డులు, అపాయింట్‌మెంట్ ఆర్డర్లను హైదరాబాద్‌లో తయారు చేసినట్లు వారు వెల్లడించారు. ప్రస్తుతం అనారోగ్యంతో ఉన్న ప్రధాన నిందితుడు సుజిత్ కోలుకున్న వెంటనే అరెస్టు చేస్తామని డీఎస్పీ శ్రీనివాసరావు స్పష్టం చేశారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితులను కూడా త్వరలోనే పట్టుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన సీఐ శ్రీనివాస్, ఎస్ఐ ప్రసన్నకుమార్ మరియు ఇతర పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు. నిరుద్యోగులు ఇలాంటి మోసపూరిత ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా ఉద్యోగాల పేరిట డబ్బులు అడిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన సూచించారు.

### పవన్‌ను దూషించిన కేసు..
## పోలీసుల అదుపులో యువకుడు



నరసరావుపేట: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను దూషించిన కేసులో ఓ యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నరసరావుపేట మండలం ములకలూరుకు చెందిన షేక్ ఇర్ఫాన్‌ను నరసరావుపేట గ్రామీణ పోలీసులు పట్టుకున్నారు. స్థానిక జనసేన నేత లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## జగన్ మాటలు..
## దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది

**: యనమల**



అమరావతి: ప్రజాస్వామ్యంలో నియంత పాత్ర పోషించి, గత ప్రభుత్వంలో పాలనను జగన్ పూర్తిగా దెబ్బతీశాడని తెలుగుదేశం సీనియర్ నేత యనమల రామకృష్ణుడు ధ్వజమెత్తారు. ఈమేరకు 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. జగన్ వైఫల్యాలంటూ కొత్త నాటకానికి తెరలేపారని విమర్శించారు. ఇలా మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని దుయ్యబట్టారు. విమర్శించడం ప్రతిపక్ష నాయకుల హక్కు అన్నారు. కానీ వాస్తవికత లేని విమర్శలను నాయకుల కంటే ప్రజలు బాగా గ్రహిస్తారని వివరించారు.

## మాగంటి గోపీనాథ్‌ను పరామర్శించిన కేటీఆర్



ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురైన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను శనివారం కలిశారు. మాగంటి కుటుంబసభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. గోపీనాథ్‌కు అందుతున్న చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గోపీనాథ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, రవీందర్ రావు, నాయకులు మాలోతు కవిత, రాగిడి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఇతర నాయకులు ఉన్నారు.

### ఏపీ ఇంటర్మీడియట్
## అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు వచ్చేశాయ్

ఈనాడు, అమరావతి: ఏపీ ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర సప్లిమెంటరీ ఫలితాలను విద్యాశాఖ విడుదల చేసింది. మే 12 నుంచి 20 వరకు జరిగిన ఈ పరీక్షలు జరిగాయి. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 1,35,826 మంది, రెండో ఏడాది పరీక్షలకు 97,963 మంది విద్యార్థులు హాజరయ్యారు.



### ఇంటర్ స్టూడెంట్స్ కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం..
## 15 వరకు గడువు పెంపు




ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 15 వరకు గడువు పెంచుతున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి డా.వి.ఎస్. అలగు వర్షిణి తెలిపారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వున్న 239 విద్యా సంస్థల్లో 2025 26 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో విద్యార్థులు చేరేందుకు (రిపోర్టింగ్) చివరి తేదీ ఈ నెల 7 వరకు ఉంది. తాజాగా ఈ గడువును 15 వరకు పొడిగించినట్లు టీ.జీ.ఎస్. డబ్ల్యు.ఆర్.ఈ.ఐ.ఎస్ (TGSWREIS) కార్యదర్శి డా. వి.ఎస్. అలగు వర్షిణి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, అలాగే తల్లిదండ్రులు గ్రహించి పెంచిన గడువు తేదీలోగా వారికి కేటాయించిన కళాశాలలో చేరాలని కోరారు.

## బార్లకు దరఖాస్తులు.. ఎక్సైజ్ శాఖకు భారీగా ఆదాయం

జీహెచ్ఎంసీ, రాష్ట్రంలోని ఇతర జిల్లాల పరిధిలో కొత్తగా ఏర్పాటు చేయనున్న బార్ల కోసం దరఖాస్తులు భారీగా వచ్చాయి. ఈ దరఖాస్తుల రుసూం ద్వారా ఎక్సైజ్ శాఖకు రూ.36.68 కోట్ల ఆదాయం సమకూరింది. జీహెచ్ఎంసీ పరిధిలో 24 బార్లు, రంగారెడ్డి, మహబూబ్ నగర్, నిజామాబాద్ జిల్లాలో 4 బార్లు ఏర్పాటు చేసేందుకు ఎక్సైజ్ శాఖ ఇటివలే ఓ ప్రకటన జారీ చేసింది. ఈ నెల 6 వరకు దరఖాస్తులకు గడువు విధించింది. ప్రకటించిన ప్రాంతాల్లో బార్లు ఏర్పాటు చేసేందుకు దరఖాస్తుదారులు పెద్ద ఎత్తున పోటీ పడ్డారు. జీహెచ్ఎంసీ పరిధిలో 24 బార్లకు 3,520 దరఖాస్తులు. రంగారెడ్డి, మహబూబ్ నగర్, నిజామాబాద్ జిల్లాలో 4 బార్లకు 148 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులతో ఎక్సైజ్ శాఖకు రూ.36.68 కోట్ల ఆదాయం వచ్చిందని ఆ శాఖ పేర్కొంది. ఈ నెల 13న డ్రా పద్దతి ద్వారా బార్లకు యజమానులను ప్రకటించనున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 24 బార్లకు వచ్చిన



దరఖాస్తులను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్, అలాగే జిల్లాల పరిధిలో అయితే ఆయా జిల్లాల కలెక్టర్లు డ్రా తీసీ బార్ల యజమానులను ఎంపిక చేయనున్నారు. రంగారెడ్డి జిల్లా సరూర్ నగర్ జల్ పల్లి మున్సిపాలిటీలో ఏర్పాటు చేయనున్న బారుకు అత్యధికంగా 57 దరఖాస్తులు వచ్చాయి. మహబూబ్ నగర్ లో ఏర్పాటు చేయనున్న బార్ కు 49 దరఖాస్తులు, నిజామాబాద్ లో ఏర్పటు చేయనున్న బార్ కు 27 దరఖాస్తులు, నిజామాబాద్ జిల్లా బోధనలో ఏర్పాటు చేయనున్న బార్ కు 15 దరఖాస్తుల చొప్పునా వచ్చాయి. బార్ హోల్డర్ ని ఎంపిక చేయడానికి డ్రా ఎక్కడెక్కడ అనే విషయాన్ని ఒకటి రెండు రోజుల్లో తెలియజేస్తామని రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ పి దశరథ్ వెల్లడించారు.



# అచ్చం కాలిఫ్లవర్‌లా ఉండే ఇది మనకు చేసే మేలు ఏమిటో తెలుసా..?

చూసేందుకు అచ్చం కాలిఫ్లవర్ లా ఉంటుంది. ఆకుపచ్చని రంగులో ఉంటుంది. ఇప్పటికే మీకు అర్థమైపోయి ఉంటుంది, మేం దేని గురించి చెబుతున్నామో. అదేనండీ.. బ్రోకలీ. ఇది అచ్చం కాలిఫ్లవర్‌లాగే ఉంటుంది. కానీ పువ్వు మొత్తం ఆకుపచ్చని రంగులో ఉంటుంది. మనకు బ్రోకలీ అనేక చోట్ల లభిస్తుంది. దీని గురించి చాలా మందికి తెలియదు. కానీ ఇది అందించే ఆరోగ్య ప్రయోజనాలు అద్భుతమనే చెప్పాలి. బ్రోకలీని ఆహారంలో భాగం చేసుకుంటే ఎంతో మేలు జరుగుతుంది. అనేక



పోషకాలు దీని ద్వారా మనకు లభిస్తాయి. బ్రోకలీ వల్ల పలు వ్యాధులను కూడా నయం చేసుకోవచ్చు. దీన్ని తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలని వైద్యులు, పోషకాహార నిపుణులు చెబుతున్నారు. బ్రోకలీలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది రోగ నిరోధక శక్తిని పెంచడంతోపాటు చర్మాన్ని సంరక్షిస్తుంది. కేవలం ఒక కప్పు బ్రోకలీని ఉడకబెట్టి తింటే మనకు రోజుకు కావల్సిన విటమిన్ సిలో 100 శాతం లభిస్తుంది.

### బరువు తగ్గేందుకు..

బ్రోకలీలో ఉండే విటమిన్ కె గాయాలు అయినప్పుడు రక్తం త్వరగా గడ్డ కట్టేలా చేస్తుంది. దీంతో తీవ్ర రక్త స్రావం అవకుండా జాగ్రత్త పడవచ్చు. బ్రోకలీలో ఫోలేట్ విటమిన్ బి9 అధికంగా ఉంటుంది. ఇది గర్భిణీలకు ఎంతో మేలు చేస్తుంది. శిశువు ఎదుగుదల సరిగ్గా ఉండేలా చేస్తుంది. పుట్టుక లోపాలు రాకుండా చూస్తుంది. కణజాల మరమ్మత్తులకు సహాయ పడుతుంది. బ్రోకలీలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థను



ఆరోగ్యంగా ఉంచుతుంది. షుగర్ లెవల్స్ తగ్గేలా చేస్తుంది. కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. ఇందులో ఉండే పొటాషియం బీపీని నియంత్రిస్తుంది. కండరాల పనితీరును మెరుగు పరుస్తుంది.

### రక్తహీనతకు..

బ్రోకలీలో ఐరన్ కూడా అధికంగానే ఉంటుంది. ఇది రక్తంలో ఆక్సిజన్ రవాణాకు సహాయం చేస్తుంది. రక్తహీనత రాకుండా చూస్తుంది. బ్రోకలీని తినడం వల్ల క్యాల్షియం సమృద్ధిగా లభిస్తుంది. ఇది ఎముకలు, దంతాలను ఆరోగ్యంగా, దృఢంగా ఉంచుతుంది. కండరాల పనితీరు మెరుగు పడేలా చేస్తుంది. బ్రోకలీలో ఉండే మెగ్నిషియం నాడీ మండల వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. గ్లూకోజ్ నియంత్రణకు సహాయం చేస్తుంది. బీపీని కంట్రోల్‌లో ఉంచుతుంది. ఇవే కాకుండా బ్రోకలీలో విటమిన్లు ఎ, ఇ, బి6లతోపాటు ఫాస్ఫరస్, జింక్ కూడా అధికంగానే ఉంటాయి. బ్రోకలీలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ కారకాలుగా పనిచేస్తాయి. దీని వల్ల శరీరంలో అంతర్గతంగా వచ్చే వాపులు తగ్గిస్తాయి. దీంతో గుండె జబ్బులు, డయాబెటిస్ రాకుండా అడ్డుకోవచ్చు.

### కంటి ఆరోగ్యానికి..

బ్రోకలీలో ఉండే కెరోటినాయిడ్స్ కళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి. కంటి చూపు మెరుగు పడేలా చేస్తాయి. శరీరంలోని ఫ్రీ ర్యాడికల్స్‌ను నిర్మూలిస్తాయి. దీంతో ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. క్యాన్సర్ రాకుండా రక్షిస్తాయి. బ్రోకలీలో ఉండే విటమిన్ సి వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. సీజనల్ గా వచ్చే దగ్గు, జలుబు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇలా బ్రోకలీతో మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. అయితే దీన్ని ఉడకబెట్టి లేదా పెనంపై కాస్త నెయ్యి వేసి వేయించి తినవచ్చు. ఎంతో రుచిగా ఉంటుంది. పచ్చిగా ఉన్నా కూడా రుచి మాత్రం అద్భుతంగా ఉంటుంది. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ దీన్ని ఎంతో ఇష్టంగా తింటారు. బ్రోకలీని తింటే అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చు.



# మెంతి ఆకులతో ఎన్నో ఉపయోగాలు



**మెంతులను మనం వంట ఇంటి పోపు దినుసులుగా ఉపయోగిస్తున్నాం. మెంతుల్లో అనేక ఔషధ గుణాలు ఉంటాయి. ఆయుర్వేద ప్రకారం మెంతులకు ఎంతో ప్రాధాన్యతను ఇచ్చారు. మెంతులు కేవలం రుచి కోసమే కాక ఔషధంగా కూడా పనిచేస్తాయి. మెంతులను నీటిలో నానబెట్టి తినవచ్చు. లేదా మెంతులను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను తాగవచ్చు. అలాగే మెంతి గింజల పేస్ట్‌ను తలకు లేదా ముఖానికి ఉపయోగిస్తారు. ఇక కేవలం మెంతులు మాత్రమే కాదు, మెంతి ఆకులు కూడా మనకు ఎంతగానో ఉపయోగపడతాయి. ఇవి కూడా అనేక ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. మెంతి ఆకులను కొందరు కూరల్లో వేస్తుంటారు. దీంతో కూరలకు చక్కని రుచి, వాసన వస్తాయి. అయితే మెంతి ఆకులను తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆయుర్వేదం చెబుతోంది. ఈ**

### జీర్ణ వ్యవస్థ ఆరోగ్యానికి..

మెంతి ఆకుల్లో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. మలబద్ధకం తగ్గేందుకు దోహదం చేస్తుంది. తీవ్రమైన మలబద్ధకం ఉన్నా సరే రోజూ మెంతి ఆకులను ఉడకబెట్టి తింటుంటే తగ్గిపోతుంది. మెంతి ఆకులను తింటే పేగుల్లో మలం కదలికలు సరిగ్గా ఉంటాయి. మెంతి ఆకుల్లో ఉండే ఫైబర్ మన జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేస్తుంది. దీంతో జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే కడుపు ఉబ్బరం, అజీర్తి, ఇరిటబుల్ బౌల్ సింద్రోమ్ వంటి సమస్యలను మెంతి ఆకులు తగ్గిస్తాయి. ఈ ఆకులను తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు ఎంతగానో ఉపయోగపడుతుంది. మెంతి ఆకుల జ్యూస్‌ను ఉదయం తాగుతుంటే కొవ్వును కరిగించుకోవచ్చు. దీంతో బరువు కూడా తగ్గుతారు.

### షుగర్ వ్యాధికి..

మెంతులను తినడం వల్ల డయాబెటిస్ అదుపులో ఉంటుందన్న సంగతి తెలిసిందే. అయితే మెంతులు చాలా చేదుగా ఉంటాయి. కనుక వీటిని అందరూ తినలేరు. అలాంటి వారు మెంతి ఆకులను తినవచ్చు. ఇవి కూడా చేదుగానే ఉంటాయి. కానీ మెంతులతో పోలిస్తే వాటి ఆకులు కాస్త తక్కువ చేదుగా ఉంటాయి. అందువల్ల ఈ ఆకులను తినవచ్చు. వీటిని రసం తీసి తాగవచ్చు. లేదా కూరగా అయినా వండుకుని తరచూ తినవచ్చు. దీంతో షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. షుగర్ ఉన్నవారికి మెంతి ఆకులు ఎంతో మేలు చేస్తాయి. ఈ ఆకులను తినడం వల్ల ఇన్సులిన్‌ను శరీరం సమర్థవంతంగా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ లెవల్స్ అదుపులోకి వస్తాయి. మెంతి ఆకులు శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు.

### గుండె ఆరోగ్యానికి..

మెంతి ఆకుల్లో ఉండే పొటాషియం శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారు తరచూ మెంతి ఆకులను తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. ఈ ఆకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో ఫ్రీ ర్యాడికల్స్ వల్ల జరిగే నష్టం నివారించబడుతుంది. క్యాన్సర్ కణాలు పెరగకుండా అడ్డుకోవచ్చు. మెంతి ఆకుల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రోగ నిరోధక శక్తిని సైతం మెరుగు పరుస్తాయి. దీంతో సీజనల్ గా వచ్చే దగ్గు, జలుబు, జ్వరం నుంచి బయట పడవచ్చు. ఇలా మెంతి ఆకులను తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. వీటిని రోజూ ఒక కప్పు మోతాదులో రోజూ ఉడకబెట్టి తినాలి. లేదా రసం అయినా తాగవచ్చు. దీంతో అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంటారు.



## ముకేశ్ అంబానీ మంచి మనసు..

**ముంబై ఐసీటీకి గురుదక్షిణగా రూ.151 కోట్ల విరాళం**



**ముంబై:** రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత, ఆసియాలోనే అత్యంత ధనవంతుడు ముకేశ్ అంబానీ తన మంచి మనసు చాటుకున్నారు. తాను చదువుకున్న ముంబైలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీకి భారీ విరాళాన్ని అందించారు. ఐసీటీకి రూ.151 కోట్లు విరాళంగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఈ మొత్తాన్ని సంస్థ అభివృద్ధికి ఏ విధంగానైనా ఉపయోగించుకోవచ్చని వెల్లడించారు.

విఖ్యాత రసాయన శాస్త్రవేత్త, ప్రొఫెసర్ ఎంఎం శర్మ జీవిత చరిత్ర ఆధారంగా రూపుదిద్దుకున్న 'డివైన్ సైంటిస్ట్' పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ముఖేశ్ అంబానీ ఈ కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విరాళం తన గురువు ప్రొఫెసర్ శర్మకు ఇచ్చే గురుదక్షిణ అని పేర్కొన్నారు. తాను చదువుకున్న రోజులను, ప్రొఫెసర్ శర్మతో ఉన్న అనుబంధాన్ని ముకేశ్ అంబానీ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. 1970లో ఐసీటీ నుంచి ముకేశ్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్నారు. గతంలో దీన్ని యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీగా వ్యవహరించేవారు. 2008లో దీనికి ఐసీటీగా పేరు మార్చారు.

## ఏథర్ ఈవీ స్కూటర్ కొనుగోలుకు పెరుగుతున్న ఆసక్తి



**న్యూఢిల్లీ:** భారతదేశంలో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన మార్కెట్ వేగంగా అభివృద్ధి చెందుతోంది. ప్రజలను ఇటీవల ఏథర్ రిజ్టా ఈవీ స్కూటర్ అమితంగా ఆకర్షిస్తుంది. ఇటీవల ప్రచురించిన ఫలితాల ప్రకారం ఈ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనం మొత్తం అమ్మకాలు 1 లక్ష యూనిట్లను దాటాయంటే ఈ స్కూటర్‌ను ప్రజలు ఎంతగా ఆదరిస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. ఏథర్ రిజ్టా ఈవీ స్కూటర్ ప్రీమియం లుక్‌తో వినియోగదారులకు ఆకర్షిస్తుంది. స్పోర్టినెస్‌తో పాటు ప్రీమియం అప్పీల్ వైపు మొగ్గు చూపే కస్టమర్లను టార్గెట్ చేస్తూ ఈ స్కూటర్‌ను రూపొందించారు. ముఖ్యంగా కుటుంబంలోని అందరికీ నచ్చేలా ఈ ఈవీ స్కూటర్‌ను లాంచ్ చేశారు. యూజర్ ఫ్రెండ్లీ ఫీచర్స్‌తో పాటు ఆకట్టుకునే పనితీరు, పర్యావరణ పరిరక్షణ కోసం ఆలోచించే వారు రిజ్టా ఎలక్ట్రిక్ స్కూటర్‌ను కొనుగోలు చేస్తున్నారు. బడ్జెట్-కేంద్రీకృత స్కూటర్లను కొనుగోలు చేసే వారు అధికమవుతున్న ప్రస్తుత తరుణంలో ఏథర్ రిజ్టాను కొనుగోలు చేసే వారి సంఖ్య గమనార్హం.

**డిజైన్:** ఏథర్ రిజ్టా స్టైలిష్ డిజైన్‌తో వస్తుంది. సౌకర్యంతో యాక్సెసిబిలిటీకి ప్రాధాన్యతనిచ్చేలా అందరినీ ఆకర్షిస్తుంది. ఈ స్కూటర్‌పై ఇద్దరు వ్యక్తుల సౌకర్యంగా కూర్చొవచ్చు. ముఖ్యంగా ఏథర్ రిజ్టా జెడ్ వేరియంట్ 119 కిలోల కెర్బ్ బరువు ఉన్న కారణంగా ట్రాఫిక్‌లలో తేలికగా నిర్వహించవచ్చని నిపుణులు చెబుతున్నారు. డిజైన్‌లో ఫ్లాట్ ఫుట్‌బోర్డ్, దృఢమైన గ్రాబ్ రైల్స్, విశాలమైన బాడీ ప్యానెల్స్ ఆకట్టుకుంటాయి.

**నిల్వ:** రిజ్టా నిల్వ స్థలం సగటు మధ్య తరగతి కుటుంబాన్ని ఆకర్షిస్తుంది. ఈ స్కూటర్ 34 లీటర్ల అండర్-సీట్ కంపార్ట్మెంట్‌ను అందిస్తుంది. ఫుల్ ఫేస్ హెల్మెట్‌తో పాటు షాపింగ్ బ్యాగులను నిల్వ చేయడానికి తగినంత పెద్దదిగా ఉంటుంది. అలాగే 22 లీటర్ల ఫ్రంట్ స్టోరేజ్ ఆకట్టుకుంటుంది. ఫోన్ హెూల్డర్, యూఎస్‌బీ ఛార్జింగ్ పోర్ట్, బ్యాగ్ల కోసం హుక్స్ వంటివి అచాచ్ చేసుకుంటే రోజువారీ సౌలభ్యాన్ని పెంచుతాయి.

**పనితీరు, పరిధి:** ఏథర్ రిజ్టా నగర ప్రయాణాలకు అనువుగా ఉంటుంది. జెడ్ వేరియంట్లు 4.3 కేడబ్ల్యూ పీక్ పవర్ అవుట్ పుట్‌తో వస్తాయి. అయితే ఎస్ వేరియంట్ 3.5 కేడబ్ల్యూ మోటారునుతో వస్తుంది. ఈ స్కూటర్ జిప్ మోడ్‌లో 0-40 కిమీ/గం మైలేజ్ ఇస్తుంది. యాక్సిలరేషన్ సమయం 4 సెకన్లలోపు ఉంటుంది. అలాగే 80 కిమీ/గం గరిష్ట వేగంతో దూసుకుపోతుంది. అందువల్ల ఈ స్కూటర్ రోజువారీ ట్రాఫిక్ కు సరిపోతుంది. ఈ స్కూటర్‌లో రెండు బ్యాటరీ ఎంపికలు అందుబాటులో ఉన్నాయి. 123 కిమీ ఐడీసీ పరిధిని అందించే 2.9 కేడబ్ల్యూహెచ్ ప్యాక్, 160 కిమీ క్లెయిమ్‌డ్ పరిధితో 3.7 కేడబ్ల్యూహెచ్ యూనిట్ రెండోది. రిజ్టా డ్యూయల్ రైడ్ మోడ్లను కూడా అందిస్తుంది.

## పెట్టుబడుల విషయంలో ఎన్‌ఆర్‌ఐలకు అలెర్ట్

**ఈ జాగ్రత్తలను పాటించడం మస్ట్..!**




**న్యూఢిల్లీ:** ఒక ఎన్‌ఆర్‌ఐగా మీరు ఒక దేశంలో సంపాదిస్తూ ఉండవచ్చు. అలాగే మరో దేశంలో కుటుంబ సంబంధాలను కలిగి ఉండవచ్చు. అయితే ఇలాంటి వారు ఇప్పటికీ భారతదేశంలో పెట్టుబడులు లేదా ఆస్తిని కొనసాగించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఆర్థిక ఆసక్తులు సరిహద్దులు దాటుతున్నందున ప్రస్తుత రోజుల్లో అనువైన, సమర్థవంతమైన పెట్టుబడి వ్యూహాన్ని కలిగి ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. పెట్టుబడి ప్రణాళికను రూపొందించేటప్పుడు ప్రపంచ దృక్పథాన్ని అవలంబిస్తున్నారు. చాలా మంది ఎన్‌ఆర్‌ఐలు తమ సంపదలో ఎక్కువ భాగాన్ని ఒకే మార్కెట్‌తో తరచుగా భారతదేశంతో ముడిపెట్టి పెట్టుబడి పెడుతున్నారు. భారతదేశం బలమైన వృద్ధి అవకాశాలను అందిస్తున్నప్పటికీ భౌగోళిక ప్రాంతాలలో వైవిధ్యం చూపడం వల్ల ప్రమాదాన్ని తగ్గించి, రాబడిని పెంచుతుందని పెట్టుబడిదారులు అంచనా వేస్తున్నారు. ఉదాహరణకు యూఎస్ టెక్నాలజీ కంపెనీలు మరియు యూరోపియన్ డివిడెండ్-చెల్లించే స్టాక్‌లకు ఎక్స్‌పోజర్‌తో భారతీయ ఈక్విటీలను కలపడం వల్ల వృద్ధి, స్థిరత్వం రెండూ లభిస్తాయని ఎన్‌ఆర్‌ఐలు ఆలోచిస్తున్నారు.

యూరప్‌లో నియంత్రించబడే యూసీఐటీఎస్ నిధులు లేదా గిఫ్ట్ సిటీ (భారతదేశం యొక్క అంతర్జాతీయ ఆర్థిక సేవల కేంద్రం) వద్ద భారతదేశం-కేంద్రీకృత ఏఐఎఫ్‌లు వంటి విస్తృత శ్రేణి పెట్టుబడి ఎంపికలను ఎంచుకుంటున్నారు. ఈ తరహా చర్యలు ప్రపంచ పెట్టుబడిని సులభతరం చేయడమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న కుటుంబ సభ్యులతో ఎన్‌ఆర్‌ఐల కోసం మెరుగైన పన్ను నిర్వహణ, నిధులను సులభంగా స్వదేశానికి తరలించడంతో దీర్ఘకాలిక ఎస్టేట్ ప్రణాళికకు మద్దతు ఇస్తాయి. కరెన్సీ అనేది చాలా మంది పెట్టుబడిదారులు పట్టించుకోని మరో ముఖ్యమైన అంశం. మీరు యూఎస్ డాలర్లలో సంపాదిస్తూ భారత రూపాయిలలో పెట్టుబడి పెడితే, మీ రాబడి కరెన్సీ కదలికల ద్వారా స్వయంచాలకంగా ప్రభావితమవుతుంది. అందువల్ల యూఎస్‌డీ, ఐఎన్ఆర్, జీబీపీ, ఈయూఆర్ వంటి బహుళ కరెన్సీలలో పెట్టుబడులను కలిగి ఉండటం వల్ల రిస్క్‌ను తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

# తిరుగులేని పరుగుల రాణి..

**10 రోజుల వ్యవధిలోనే జ్యోతికి రెండో స్వర్ణం..!**




**తైవాన్:** భారత అథ్లెటిక్స్‌లో సంచనంగా మారిన జ్యోతి ఎర్రాజీ మరోసారి మెరిసింది. 10 రోజుల క్రితం ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో స్వర్ణం సాధించిన తెలుగు తేజం వారం రోజుల వ్యవధిలోనే మువ్వన్నెల జెండాను రెపరెపలాడించింది. 100 మీటర్ల హర్డిల్స్‌లో తనకు తిరుగులేదని చాటుతూ తైవాన్ ఓపెన్‌లోనూ పసిడి వెలుగులు విరజిమ్మింది. శనివారం జరిగిన 100 మీటర్ల హర్డిల్స్ ఫైనల్లో చిరుతలా పరుగెత్తిన జ్యోతి 12.99 సెకన్లలోనే లక్ష్యాన్ని చేరుకుంది.

పురుషుల ట్రిపుల్ జంప్‌లో అబ్దుల్లా అబూబాకర్, మహిళల 1500 మీటర్ల పరుగులో పూజలు కూడా స్వర్ణంతో మనదేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేశారు. దక్షిణ కొరియా వేదికగా జరిగిన ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో జ్యోతి ఎర్రాజీ స్వర్ణ పతకంతో యావత్ భారతావనిని సంబురాల్లో ముంచెత్తింది. మే 29 జరిగిన పోటీల్లో ఆమె 12.96 సెకన్లలోనే ఫినిషింగ్ లైన్ చేరుకొని పసిడి మోత మోగించింది. అదే జోష్‌తో తైవాన్ ఓపెన్‌లోనూ సత్తా చాటిందీ స్ప్రింటర్.

100 మీటర్ల పరుగులో ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ఆమె.. శనివారం ప్రత్యర్థులకు వెనక్కి నెట్టేస్తూ లక్ష్యం వైపు రాకెట్‌లా దూసుకెళ్లింది. అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని ముద్దాడింది. జపాన్ అథ్లెట్లు సుకా తెరడా(13.04 సెకన్లు), చిసాటో కియోయమ (13.10 సెకన్లు) వరుసగా రెండు మూడు స్థానాల్లో నిలిచారు.

అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తూ.. మహిళల 1500 మీటర్ల ఫైనల్లో పూజా స్వర్ణం సాధించగా.. పురుషుల ట్రిపుల్ జంప్‌లో అబ్దుల్లా అబూబాకర్ పసిడితో మెరిశాడు. ఫైనల్లో అబ్దుల్లా అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తూ 16.21 మీటర్ల దూరం దుమికి నంబర్ 1 స్థానంలో నిలిచాడు. గతంలో అతడి బెస్ట్.. 17.19 మీటర్లుగా ఉంది. ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో రజతంతో సరిపెట్టుకున్న పూజ ఈసారి పసిడిని పట్టేసింది. శనివారం జరిగిన 1500 మీటర్ల రేసులో అలుపెరగకుండా పరుగెత్తిన తను అనుకున్నట్టే అందరికంటే ముందుగా 4 నిమిషాల 11.63 సెకన్లలో ఫినిషింగ్ లైన్ దాటింది.

## విరాట్ కోహ్లీపై పోలీసులకు ఫిర్యాదు




**బెంగళూరు:** ఆర్‌సీబీ విజయోత్సవ కార్యక్రమం సందర్భంగా బెంగళూరులో బుధవారం జరిగిన తొక్కిసలాట ఘటనతో స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ చిక్కుల్లో పడ్డారు. ఈ ఘటనకు బాధ్యుడిని చేస్తూ కోహ్లీపై కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదులు వస్తున్నాయి. శివమొగ్గ జిల్లాకు చెందిన హెచ్‌ఎమ్ వెంకటేశ్ అనే వ్యక్తి కబ్బన్ పోలీసు స్టేషన్‌లో కోహ్లీపై ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఇప్పటికే రిజిస్టరైన కేసులో భాగంగా ఈ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

ఐపీఎల్ 2025లో ఆర్‌సీబీ జట్టు విజయం సాధించిన విషయం తెలిసిందే. దాదాపు 18 ఏండ్ల నిరీక్షణ తర్వాత ఐపీఎల్ కప్పును ముద్దాడింది. ఈ సందర్భంగా బుధవారం బెంగళూరులో ఆర్‌సీబీ విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొక్కిసలాట జరిగింది. ఈ దుర్ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా.. 47 మందికిపైగా గాయపడ్డారు.

ఇప్పటికే ఈ ఘటనపై ఆర్‌సీబీ, కర్ణాకట క్రికెట్ సంఘం, ఈవెంట్ మేనేజర్లపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. మరోవైపు ఘటన నేపథ్యంలో ఆర్‌సీబీ జట్టు స్టార్ ఆటగాడైన విరాట్ కోహ్లీ పేరు సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. తొక్కిసలాటకు భాద్యుడిగా కోహ్లీని అరెస్ట్ చేయాలని సోషల్ మీడియాలో నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు నెటిజన్లు విపరీతంగా ట్రెండ్ చేస్తున్నారు.

పుష్ప-2 స్క్రీనింగ్ సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. థియేటర్‌కు టాలీవుడ్ స్టార్ అల్లు అర్జున్ రావడంతోనే తొక్కిసలాట జరిగిందని, పోలీసులు వద్దని వారించినా ఆయన కారులో పరేడ్ నిర్వహించారని ఆరోపిస్తూ ఆ హీరోను అరెస్ట్ చేశారు. ఇప్పుడు కోహ్లీని చూడటానికే లక్షలాది మంది చిన్నస్వామి స్టేడియానికి వచ్చారని, ఈ క్రమంలోనే తొక్కిసలాట జరిగి 11 మంది మృతి చెందారని అల్లు అర్జున్ అభిమానులు అంటున్నారు. మరి, తమ హీరోను తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్ట్ చేసినట్టే, ఇప్పుడు కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కోహ్లీని కూడా అరెస్ట్ చేస్తుందా..? అని కామెంట్లతో హెూరెత్తిస్తున్నారు. ఈ క్రమంలో ట్రెండింగ్‌లో కొనసాగుతోంది.

## బెంగళూరు తొక్కిసలాట కేఎస్‌సీఏ సెక్రటరీ, ట్రెజరర్ రాజీనామా

**బెంగళూరు:** విజయోత్సవ వేడుక సందర్భంగా బుధవారం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట జరిగిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోగా.. 47 మందికిపైగా గాయాలపాలయ్యారు. ఈ ఘటనకు సంబంధించి కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘంపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా కీలక పరిణామం చోటు చేసుకుంది. కేఎస్‌సీఏ సెక్రటరీ, ట్రెజరర్ తమ




పదవులకు రాజీనామా చేశారు.

క్రికెట్ సంఘం కార్యదర్శి ఏ శంకర్, ట్రెజరర్ ఇ.జైరాం రాజీనామా సమర్పించారు. శుక్రవారం రాత్రి కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడికి తమ రాజీనామా పత్రాలకు పంపినట్లు వారు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 'గత రెండు రోజులుగా జరిగిన ఊహించని, దురదృష్టకర సంఘటనల కారణంగా మా పాత్ర చాలా పరిమితం అయినప్పటికీ.. నైతిక బాధ్యతగా రాజీనామా చేశాం. నిన్న కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడికి రాజీనామా లేఖ పంపాము' అని వారు ఓ ప్రకటనలో వెల్లడించారు.

ఇప్పటికే ఈ ఘటనపై ఆర్‌సీబీ, కర్ణాకట క్రికెట్ అసోసియేషన్, ఈవెంట్ మేనేజర్లపై కబ్బన్ పార్క్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తొక్కిసలాట ఘటనలో తమపై నమోదైన కేసును రద్దు చేయాలని కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంస్థ (కేఎస్‌సీఏ) ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. సంస్థ అధ్యక్షుడు రఘురామ్ భట్, కార్యదర్శి ఎ శంకర్, కోశాధికారి ఇ.ఎస్. జైరాం నమోదైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని అర్జీలో కోరారు. దీనిపై నిన్న మధ్యాహ్నం విచారణ జరిపిన హైకోర్టు.. వారిపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని పోలీసులు, ప్రభుత్వానికి సూచించింది. అనంతరం తదుపరి విచారణను న్యాయస్థానం ఈనెల 13వ తేదీకి వాయిదా వేసింది. విచారణకు సహకరించాలని, న్యాయస్థానం పరిధి దాటి ఎక్కడకు వెళ్లాలన్నా ముందస్తు అనుమతి తీసుకోవాలని అర్జీదారులకు న్యాయస్థానం సూచించింది.

# గ్రాండ్‌స్లామ్ వీరుడికి పంచ్..

**తొలిసారి ఫైనల్లో ఇటలీ కెరటం..!**

**ఫ్రెంచ్:** ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ ఫేవరెట్లలో ఒకడైన నొవాక్ జకోవిచ్ పోరాటం సెమీ ఫైనల్లోనే ముగిసింది. మట్టికోర్టులో మరో ట్రోఫీ గెలవాలనుకున్న అతడి కలను కల్లలు చేశాడు జన్నిక్ సిన్నర్. కెరియర్లో అత్యధిక గ్రాండ్‌స్లామ్స్‌తో చరిత్ర సృష్టించిన జకోకు ఇటలీ కెరటం చెక్ పెట్టాడు. శనివారం ఉత్కంఠగా సాగిన పోరులో సెర్బియా వీరుడికి చుక్కలు చూపిస్తూ ఫైనల్‌కు దూసుకెళ్లాడీ వరల్డ్ నంబర్ 1. తద్వారా ఓపెన్ ఎరాలో ఈ మెగా టోర్నీ తుది పోరుకు అర్హత సాధించిన రెండో ఇటాలియన్‌గా సిన్నర్ రికార్డు నెలకొల్పాడు.



మాజీ వరల్డ్ నంబర్ 1 జకోవిచ్ మరో గ్రాండ్‌స్లామ్ ఆశలపై సిన్నర్ నీళ్లు చల్లాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో టైటిల్ దిశగా సాగుతున్న అతడిని సెమీస్‌లో ఇంటికి పంపాడీ యంగ్‌స్టర్. 'నువ్వానేనా' అన్నట్టు సాగిన పోరులో ఏమాత్రం ఒత్తిడికి లోనవ్వకుండా జకోపై పైచేయి సాధించాడీ ఇటలీ సెన్సేషన్. తొలి సెట్ కోల్పోయినప్పటికీ కంగారు పడకుండా.. తన మార్క్ ఆటతో విరుచుకుపడ్డాడు సిన్నర్. బలమైన ఏస్‌లు, పదునైన సర్వ్‌లతో చెలరేగి వరుసగా రెండు సెట్లను 7-5, 7-5 తో గెలుపొందిన అతడు మ్యాచ్ విజేతగా నిలిచాడు.

'జకో అత్యుత్తమైన ఆటగాడు. అతడిని ఓడించాలంటే సర్వ శక్తులు ఒడ్డాల్సిందే. అందుకే సెమీస్‌లో నేను నా బెస్ట్ గేమ్ ఆడాను. మానసికంగా బలంగా ఉండడంతో పాటు ప్రతి పాయింట్ గెలవాలనే ఉద్దేశంతో ఆడాను. అంతేకాదు జకోకు కౌంటర్ అటాక్ ఇవ్వడం చాలా ముఖ్యం. అది సాధ్యమవ్వాలంటే శ్రద్ధగా ఉండాలి. సో.. సెమీస్‌లో నేను అదే చేశాను' అని మ్యాచ్ అనంతరం సిన్నర్ తెలిపాడు. టైటిల్ పోరులో అతడు డిఫెండింగ్ ఛాంపియన్ కార్లోస్ అల్కరాజ్‌ను ఢీకొట్టనున్నాడు.



## కోలీవుడ్‌లో నెంబర్‌వన్‌గా
# మమిత బైజు

**టాకీస్:** కొత్త సినిమాల టాపిక్ వచ్చిన్ ప్రతిసారీ క్రేజ్ ఉన్న హీరోయిన్లను గురించి మాట్లాడుకోవడం అలవాటు. ఇప్పుడు మమిత బైజు గురించి కూడా కోలీవుడ్‌లో అలాంటి టాపిక్కే నడుస్తోంది. ఫోర్త్ కమింగ్ స్టార్ హీరోల సినిమాల్లో నాయికగా మమిత పేరే స్ట్రాంగ్‌గా వినిపిస్తోంది. ప్రేమలు సినిమాతో పాపులారిటీ సంపాదించుకున్నారు మమిత బైజు. తెలుగులో వరుస సినిమాలతో హల్‌చల్ చేసే అవకాశాలు చాలానే ఉన్నాయనే టాక్ అప్పట్లో బాగా నడిచింది. బట్, సర్‌ప్రైజింగ్గా ఆమె కోలీవుడ్‌కే పరిమితమయ్యారు. ప్రస్తుతం విజయ్‌తో జననాయగన్ సినిమా చేస్తున్నారు మమిత. ఇటు తెలుగు ప్రొడక్షన్ హౌస్‌కి కూడా సైన్ చేశారు ఈ బ్యూటీ. ప్రదీప్ రంగనాథన్ నెక్ట్స్ సినిమాలో నాయికగా నటిస్తున్నారు మమిత బైజు. ఈ సినిమా ఓపెనింగ్ ఆ మధ్య జరిగింది. నెక్ట్స్ సూర్య సినిమాలోనూ హీరోయిన్‌గా నటిస్తున్నారు మమిత. పళని మురుగన్ ఆలయాన్ని దర్శించి పనులు మొదలుపెట్టేసింది టీమ్. సూర్య పక్కన ప్రేమలు బ్యూటీని ఎప్పుడెప్పుడు చూస్తామా అని వెయిట్ చేస్తున్నారు ఫ్యాన్స్. వీటన్నిటికీ తోడు ధనుష్‌తోనూ త్వరలో మమిత జోడీ కట్టనున్నారనే టాక్ స్ప్రెడ్ అవు తోంది. ఇప్పుడు వినిపిస్తున్న ఈ ప్రాజెక్టులన్నీ థియేటర్ల కు వచ్చి సక్సెస్ అయి తే, నెక్ట్స్ నెంబర్ వన్ హీరోయిన్ రేసుకి మమిత టఫ్ పోటీ ఇవ్వడానికి రెడీగా ఉన్నట్టే మరి.

# టాలీవుడ్ కష్టాలకు పరిష్కారం
## ప్రత్యేక కమిటీ ఏర్పాటు

**టాకీస్:** తెలుగు చలనచిత్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలకు సంబంధించి టాలీవుడ్ ఇటీవల తరచుగా వార్తల్లో నిలుస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ సమస్యలను




పరిష్కరించడానికి 30 మంది సభ్యులతో కూడిన ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ తాజాగా ప్రకటించింది. ఈ కమిటీలో నిర్మాతలతో పాటు డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్ల రంగాల నుంచి సభ్యులున్నారు. ఈ కమిటీకి తెలుగు ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్ ఛైర్మన్‌గా వ్యవహరించనుండగా, ఛాంబర్ సెక్రటరీ దామోదర ప్రసాద్ కన్వీనర్‌గా ఉండనున్నట్లు తెలిపారు. నిర్మాతల విభాగం తరపున దామోదర ప్రసాద్, దిల్ రాజు, ప్రసన్నకుమార్, సి.కల్యాణ్, రవికిషోర్, రవి శంకర్, నాగవంశీ, దానయ్య, స్వప్నదత్, సుప్రియ. సభ్యులు ఉండనున్నారు. గత నెల మే 30న విశాఖపట్నంలో జరిగిన తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ఈ కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు ఫిల్మ్ ఛాంబర్ ప్రకటించింది. ఈ కమిటీ ఇండస్ట్రీలో ప్రస్తుతం ఉన్న సమస్యలపై చర్చించి త్వరలోనే పరిష్కార మార్గాలను చూపనున్నట్లు తెలుస్తుంది.




# కంటికి కనపడని యుద్ధం చేస్తున్న త్రిష, నయన్

**టాకీస్:** థగ్ లైఫ్ సినిమాతో శ్రుతిహాసన్ మాత్రమే కాదు, త్రిష అండ్ నయన్ కూడా యమాగా ట్రెండ్ అవుతున్నారు. శ్రుతి పాట పాడారు, ఆ పాట గురించి మాట్లాడారు కాబట్టి ట్రెండింగ్ ఓకే. త్రిష అందులో యాక్ట్ చేశారు కాబట్టి ఓకే. మరి నయనతార ప్రస్తావన ఎందుకొచ్చినట్టు.. కమాన్ లెట్స్ వాచ్... థగ్ లైఫ్‌లో త్రిష షుగర్ బేబీ అంటూ స్టెప్పులేసిన తీరు చూసి, వింటేజ్ పొన్ను ఈజ్ బ్యాక్ అని అనుకున్నారు. ఎలాగూ గుడ్ బ్యాడ్ అగ్లీ హిట్ మీదున్నారు కదా... థగ్ లైఫ్ కూడా ఆ సక్సెస్ స్ట్రీక్‌ని కంటిన్యూ చేస్తుందని భావించారు జనాలు. కాకపోతే అనుకున్నదొకటి అయ్యిందొకటి. థగ్ లైఫ్‌లో త్రిష రోల్ మీద ట్రోల్ స్టార్ట్ అయింది. కొన్ని సన్నివేశాల్లో త్రిష హద్దు మీద అందాల ప్రదర్శన చేశారనే టాక్ వైరల్ అవుతోంది. అంతే కాదు, ఈ సినిమాలో త్రిష రోల్ తీసేసినా కథా పరంగా పెద్దగా వచ్చే నష్టం ఏమీ లేదనే మాటలూ వినిపిస్తున్నాయి. మణిరత్నం థగ్ లైఫ్ కథ చెప్పగానే... కేరక్టర్ పేలవంగా ఉందని అర్థం చేసుకున్నారు కాబట్టే, ఈ సినిమా నుంచి నయనతార తప్పుకున్నారని అంటున్నారు నెటిజన్లు. సినిమా నుంచి క్విట్ అయి మంచి పని చేశారంటూ నయన్‌కి థాంక్స్ చెప్పుకుంటున్నారు ఫ్యాన్స్. ఒకప్పుడు నయన్‌కీ, త్రిషకీ మధ్య పచ్చగడ్డి వేసినా భగ్గుమనేది. కానీ ఇప్పుడు ఇద్దరూ ఫ్రెండ్లీగానే ఉంటున్నారు. వారిద్దరు కలిసి పోయినా, ఫ్యాన్స్ లో మాత్రం ఇంకా ఐకమత్యం రాలేదనే విషయం.. ఇప్పుడు త్రిషను నెగటివ్‌గా ట్రోల్ చేయడాన్ని బట్టి అర్థం అవుతోందంటున్నారు క్రిటిక్స్.



## ఉత్కంఠగా ఆది సాయికుమార్ 'శంబాల' టీజర్

**టాకీస్:** టాలీవుడ్ యువ కథానాయకుడు ఆది సాయికుమార్ నటిస్తున్న తాజా చిత్రం 'శంబాల.. ఏ మిస్టిక్ వరల్డ్' యుగంధర్ ముని దర్శకత్వం వహిస్తున్న ఈ సూపర్ నాచురల్ హారర్ థ్రిల్లర్‌లో అర్చన అయ్యర్, స్వాసిక్ హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రంపై అంచనాలు భారీగా ఉన్నాయి. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమా నుంచి టీజర్‌ను తాజాగా విడుదల చేసింది చిత్రయూనిట్.



ఈ విశ్వంలో అంతుపట్టని రహస్యాలు ఎన్నో ఉన్నాయి. సైన్స్‌కు సమాధానం దొరకనప్పుడు వాటిని మూఢనమ్మకం అంటుంది. అదే సమాధానం దొరికితే అదే తన గొప్పతనం అంటుంది అనే డైలాగ్‌తో ఈ టీజర్ స్టార్ట్ అవుతుంది. అనంతరం ఆకాశం నుంచి ఒక ఉల్క లాంటి రాయి కిందికి వచ్చి ఒక ఊరిలో పడుతుంది. అయితే అది పడిన తర్వాత నుంచి ఆ ఊరిలో ప్రజలు వింతగా ప్రవర్తిస్తుంటారు. అయితే దాని వెనుక ఉన్న రహస్యం ఏంటీ అనేది తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందే. ఆది సాయికుమార్ ఈ చిత్రంలో భౌగోళిక శాస్త్రవేత్తగా ఓ ఛాలెంజింగ్ పాత్రలో కనిపించనున్నారు.

## '8 వసంతాలు' నుంచి కొత్త టీజర్

**టాకీస్:** టాలీవుడ్ యువ దర్శకుడు ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం '8 వసంతాలు'. దాదాపు 7 సంవత్సరాల తర్వాత మెగాఫోన్ పట్టిన ఈ దర్శకుడు ప్రస్తుతం లేడీ ఓరియెంటెడ్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. ఈ సినిమాను టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై రవి శంకర్ నిర్మిస్తుండగా.. ఈ సినిమాలో మ్యాడ్ చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న అనంతిక సనిల్ కుమార్ లీడ్ రోల్‌లో నటిస్తుంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేసిన చిత్రయూనిట్ తాజాగా మరో అప్‌డేట్‌ను పంచుకుంది.

ఈ సినిమాను జూన్ 20న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త టీజర్‌ను పంచుకుంది. ఫస్ట్ టీజర్‌లో కథానాయికను పరిచయం చేసిన టీమ్.. రెండో టీజర్‌లో హీరో పాత్రను పరిచయం చేసింది. మధురం అనే షార్ట్ ఫిల్మ్‌తో గుర్తింపు తెచ్చుకున్న రవి తేజ దుగ్గిరాల ఈ సినిమాలో కథానాయకుడిగా నటిస్తున్నాడు. 'ఊటీకి కొత్తగా వచ్చిన తెలుగు రచయిత అతడు. తను పదాలను ప్రేమతో రాస్తే తడిసిన గులాబీ పూలలా ఉంటాయి. అదే కసితో రాస్తే, పిన్ పీకిన గ్రనేడ్‌లా ఉంటాయి' అంటూ మొదలైన టీజర్ ప్రేమ కవిత్వంతో పొంగిపోయేలా ఉంది. 'ప్రేమంటే మనం చేరాల్సిన గమ్యం కాదు.. చేయాల్సిన ప్రయాణం' అంటూ హీరో చెప్పిన డైలాగ్ అకట్టుకుంది.




## కన్నప్పకి కష్టాలు..
### సినిమాని అడ్డుకుంటామంటూ బ్రాహ్మణ సంఘాలు వార్నింగ్

**టాకీస్:** మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్పకి అడుగడుగునా అవాంతరాలు ఎదురవుతూనే ఉన్నాయి. కన్నప్ప చిత్రం జూన్ 27న విడుదల కానుండగా, ఈ సినిమాని అడ్డుకుంటామంటూ తాజాగా బ్రాహ్మణ సంఘాలు పిలుపునిచ్చాయి. కన్నప్ప సినిమాలో పిలక గిలక పాత్రపై బ్రాహ్మణ సంఘాలు మండిపడుతున్నాయి. గుంటూరులో ఇవాళ(శనివారం) కన్నప్ప సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించనున్నారు. ఫ్రీ రిలీజ్ ఈవెంట్‌ని అడ్డుకుంటామని బ్రాహ్మణ సంఘాలు హెచ్చరిస్తున్నాయి.. ఈ మేరకు బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు శ్రీధర్ ఓ ప్రకటన కూడా విడుదల చేశారు.




మంచు మోహన్ బాబు కుటుంబానికి బ్రాహ్మణులని అవమానించడం అలవాటేనని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలోనూ చాలా సినిమాల్లో బ్రాహ్మణులను కించపరిచిన వారు కన్నప్ప సినిమాలో పిలక గిలక పాత్ర పెట్టారు. ఈ పాత్రపై ఈ రోజు జరిగే ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో స్పష్టత ఇవ్వకపోతే కోర్టును ఆశ్రయించి సినిమాని అడ్డుకుంటామంటూ హెచ్చరించారు. బ్రాహ్మణులను కించపరిచే విధంగా పాత్రలతో సినిమాలు నిర్మించడం ఇప్పటికైనా మంచు మోహన్‌బాబు కుటుంబం మానుకోవాలంటూ శ్రీధర్ ధ్వజమెత్తారు. దీనిపై చిత్ర యూనిట్ వారు ఆలోచన చేయాలని అన్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో కన్నప్ప నుండి పిలక గిలక అనే హాస్య పాత్రలని పరిచయం చేశారు. ఇందులో బ్రహ్మానందం, సప్తగిరి ఉన్నారు. పోస్టర్‌లో చేపకు ఈత, పులికి వేట, కోకిలకి పాట నేర్పిన గురువులు.. అడవికే పాఠాలు చెప్పడానికి వస్తే.. అనే డైలాగ్ కూడా రివీల్ చేశారు. ఇప్పుడు ఇవే తమ మనోభావాలని కించపరుస్తున్నాయంటూ బ్రాహ్మణ సంఘాలు మండిపడుతున్నాయి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.